## గణనాధుని సేవలో రష్యన్ దేశస్థులు

కాణిపాకం, నవంబర్ 9 ప్రభాతవార్త:



రష్యన్ దేశానికి చెందిన భక్తులు ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. రష్యన్ దేశానికి చెందిన 10 మంది భక్తులు ఆదివారం కాణిపాకం చేరుకుని సంప్రదాయ దుస్తులు ధరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ప్రోటోకాల్ అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు




## నంది వాహనంపై ఆది దంపతులు

### వైభవంగా ముక్కోటి ఉత్సవాలు

చంద్రగిరి, నవంబర్ 9 ప్రభాతవార్త:



ఆది దంపతులైన శివపార్వతులు నంది వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడ స్వర్ణముఖీ నదీతీరాన వెలసియున్న శ్రీ ఆనందవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో రుద్ర పాదాల ముక్కోటి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు సుబ్రమణ్య స్వామి ఆదివారం వేకువజామున శ్రీ ఆనందవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారికి చందనం, విభూధి, కుంకుమ, సుగంధద్రవ్యాలతో అభిషేకించి, సుగంధభరిత పుష్పాలతో విశేష అలంకరణ గావించారు. తదుపరి విశేష అలంకరణలతో ఉదయం నంది వా హనంపై, రాత్రి రావణాసురవాహనంపై విహరిస్తూ దర్శనమిచ్చారు.

## ఆకట్టుకున్న

# కుంకీ ఏనుగుల ప్రదర్శన



ఏనుగులకు మత్తు మందు ఇచ్చే గన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

చిత్తూరు(పలమనేరు), నవంబర్ 9 ప్రభాతవార్త:

పలమనేరు ముసలిమడుగు ఏనుగుల శిక్షణా కేంద్రంలో ఆదివారం కుంకీ ఏనుగులు చేసిన ప్రత్యేక ప్రదర్శన ఆకట్టుకుంది. డిప్యూటీ సీఎం, రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదివారం కుంకీ ఏనుగుల శిక్షణా కేంద్రంను ప్రారంభించడానికి ముసలిమడుగు వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కుంకీ ఏనుగులకు చూపుతున్న మెళకువలు, ఇటీవల జరిగిన ఆపరేషన్ల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా కుంకీ ఏనుగులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కుంకీ ఏనుగులు ఒకేసారి వరుసగా వస్తూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు సెల్యూట్ చేశాయి. అనంతరం అటవీశాఖ అధికారులు అడవిలో లభ్యమయ్యే వివిధ రకాల కలపను ఏనుగుల సహాయంతో ఎలా బయటికి తీసుకువచ్చేది అనే విషయంను ఏనుగుల చేత ప్రదర్శింపచేయడంతో దీనిని డిప్యూటీ సీఎం తిలకించారు. అలాగే మానవ-ఏనుగుల మధ్య ఘర్షణ తలెత్తినపుడు మదపుటేనుగుల గుంపు నివాసాలు, పంట పొలాల వైపు వస్తున్నప్పుడు వాటిని ఎలా నియంత్రించాలో అటవీశాఖ అధికారులు కుంకీ ఏనుగులతో ప్రత్యక్షంగా చేయించిన ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే మదపుటేనుగులు అదుపు తప్పినపుడు వాటికి ప్రత్యేకంగా మత్తు ఇచ్చి వాటి కోపంను ఎలా అణచివేస్తారనే విషయంను మావటీలు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు చూపించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మదపుటేనుగులకు మత్తు మందు ఇచ్చే గన్‌ను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా కుంకీ ఏనుగులు చేసిన ప్రదర్శనను డిప్యూటీ సీఎం ఆసక్తిగా తిలకించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుంకీ ఏనుగులకు స్వయంగా బెల్లం, ఆహారం అందజేశారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కుంకీ ఏనుగులు ఆశీర్వచనం చేశాయి. అనంతరం డిప్యూటీ సీఎం ముసలమడుగులో నూతనంగా ఏర్పాటు చేసిన ఏనుగుల క్యాంపును ప్రారంభించారు. అలాగే ఏనుగుల క్యాంపులో ఏర్పాటు చేయనున్న గజారామం నగర వనానికి డిప్యూటీ సీఎం పునాది రాయి వేశారు. అలాగే సౌరశక్తితో పని చేసే వేలాడే అటవీ ఏనుగుల నిరోధక కంచె నిర్మాణానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ పునాది రాయి వేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్యేలు అమరనాధరెడ్డి, గురజల జగన్మోహన్ నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు, జిల్లా అటవీశాఖ అధికారి సుబ్బరాజు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, అనంతపురం సర్కిల్ అటవీ సంరక్షణ అధికారి ఆర్.యశోద భాయ్, పర్యావరణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు కొల్ల : పరిష్కారం డొల్ల



### నేడు ఎంఎల్ఏ సారధ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయ మొదటి ధర్మకర్తల మండలి సమావేశం

**శ్రీకాళహస్తీశ్వరాలయంలో సమస్యలు కొల్లలుగా ఉన్నాయి. ఓ వైపు అభివృద్ధి యుద్ధ ప్రాతిపదికపై సాగుతోంది. కానీ దళారుల దందాలు మాత్రం కట్టడి కావటం లేదు.వచ్చిన భక్తులు నానా తిప్పలు పడుతున్నారు. కానీ తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక భోళాశంకరునికే అప్పగించి పలాయనం చిత్తగిస్తున్నారు.రాహుకేతుదోష నివారణ పూజల్లో రేట్లు ఖరారు చేసి వసూలు చేసుకుంటున్నారు. అవసరం లేని అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దాంతో శివయ్య నెత్తిన ఖర్చుల భారం మోపుతున్నారు.ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయ కమిటి మొదటి సమావేశం సోమవారం ఎంఎల్ఏ అధ్యక్షతన జరగనుంది.**

శ్రీకాళహస్తి,నవంబర్ 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ పదవిని కూటమి సర్దుబాట్లులో జనసేనకు అప్పగించారు. ధర్మకర్తల మండలిలో గత సంప్రదాయాలకు స్వస్తి చెప్పి ఈ సారి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వారితో భర్తీ చేసారు.16 మందితో కొత్త పాలకమండలిని నామినేట్ చేసారు.ఈ కమిటి సమావేశం సోమవారం నిర్వహించనున్నారు.ఈ సమావేశం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నారు.శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలనలో సంస్కరణలు తీసుకొస్తామంటూ శాసన సభ్యుడు సుధీర్‌రెడ్డి గెలిచిన మొదటి సమావేశంలో ప్రకటించారు.అయితే ఎన్ని అమలు జరుగుతున్నాయన్నది ముక్కంటీశునికే ఎరుక. శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చిన భక్తులు సవాలక్ష సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఇక్కడ భక్తిభావంతో వచ్చే భక్తులు నిలువుదోపిడికి గురౌతున్నారు. ఆలయం బయట దుకాణదారులు భక్తులను దోపిడి చేస్తున్నారని అదుపు చేయాలనుకుంటున్న అధికా రులు ఆలయం లోపల సాగుతున్న అవినీతిని ఎందుకు కట్టడి చేయలేదన్నది చర్చనీయాంశంగా మారింది.

**భక్తుల బాధలు పట్టించుకునే దెవరు?**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు పడుతున్న బాధలు అధికారులకు పట్టడం లేదు.సిసి కెమెరాల్లో పరిశీలన తప్ప భక్తుల బాధలు పరిష్కారమయ్యేది లేదు. ఇక్కడ భక్తులు ముఖ్యంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తే . . .

-ఆలయంలో అభిషేకాల టిక్కెట్లు ఆన్‌లైన్ చేసారు! కానీ పొరుగు రాష్ట్రా భక్తులకు సమాచారం లేక ఇక్కడకు వచ్చి తిప్పలు పడుతున్నారు. ఆప్‌లైన్‌లో కొన్ని టిక్కెట్లు రిజర్వ్ చేసుకొని సదుపాయం కల్పించేందుకు అధికారులు సుముఖత చూపటం లేదు.

-అన్ని అన్ లైన్ అంటూ ప్రకటించారు.కానీ ఇక్కడకు వచ్చేభక్తులకు క్యాష్‌మాత్రమే అనటంలో వచ్చినభక్తులు నగదు కోసం పట్టణంలో దుకాణాల వద్ద యాత్రికులు పడిగాపులు పడుతున్నారు.

-ఆలయానికి వచ్చే భక్తులు లోపల అడుగుపెట్టినప్పటి నుంచి అడుగడుగునా దోపిడి. రాహుకేతుపూజల్లో రేట్లు ఖరారు చేసి వసూళ్ళు.పరివార దేవతల వద్ద తట్టలతో వసూళ్ళు

-సామాన్య భక్తులు క్యూలైన్లలో పడిగాపులు.వైట్‌కాలర్ సభ్యులు దర్జాగా రాజమార్గంలో

-మాస్టర్ ప్లాన్ అమలు ప్రశ్నార్థకం.ఒక్కరి కోసం రూ.వంద కోట్ల పెట్టుబడి వృధా

-పార్కింగ్‌కు సరిపడినంత స్థలం లేక ఎక్కడ బడితేఅ క్కడ పార్కింగ్

- వరదరాజస్వామి ఆలయ నిర్మాణం ఐదేళ్ళుగా కొనసాగుతూనే ఉంది.

- ప్రసాదాల తయారి,భోజనం తయారిలో వాడుతున్న వస్తువుల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది.

-పట్టణంలో సమాచార కేంద్రాలు దిష్టిబొమ్మలుగా మారాయి.

ఇవి కొన్ని మాత్రమే.ఇలాంటి సమస్యలు ఎన్నో చోటు చేసుకున్నాయి. వచ్చిన భక్తులు సుదర్శనం కోసం తల్లడిల్లుతున్నారు.కానీ వచ్చిన భక్తులు భోళాశంకరుని దర్శనం కోసం తల్లడిల్లు తున్నారు.కొత్త పాలకమండలి అయినా భక్తుల మనోభావాలను గుర్తించి పరిష్కరిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

# కల్తీనెయ్యిలో "వైవి"చుట్టూ ఉచ్చు!

## సిట్ విచారణకు రాక తప్పదా!?




తిరుపతి,నవంబర్ 9ప్రభాతవార్త:

వెంకన్న లడ్డూల తయారీకి కల్తీనెయ్యి సరఫరా జరిగిందనే వివాదంలో మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పాత్ర ఉందనేది సిబిఐ సిట్ అధికారులు దాదాపు తేల్చేసిన విషయంలో ఇప్పుడు ఆయనను విచారణకు పిలవనున్నారనేది తెలిసింది.కల్తీనెయ్యి పాపంలో అక్రమాలకు వంతపాడిన సూత్రధారుల వ్యవహారం కీలకమనేది సిట్ వాదనలు.ఇప్పుడు ఈ కేసులో టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి సిట్ విచారణ తప్పదనేది విశ్వసనీయ సమాచారం. అదే జరిగితే మరికొందరు టిటిడి పూర్వ అధికారులు, కొనుగోలుకమిటీలో గత బోర్డు సభ్యులు కూడా వస్తారనేది సమాచారం. ఆయన పిఏ చిన్నఅప్పన్నను సిట్ అరెస్ట్‌చేసి రెండురోజులు రాబట్టిన సమాచారంతో వైవి సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా కొనసాగిన కాలంలో కల్తీ నెయ్యిసరఫరాలో మేరకు లాభపడ్డారనే అంశాలపై సిట్ విచారణ చేయనుంది. వైవి ,అతని సతీమణి బ్యాంకు ఖాతాల వివరాలను సిట్ సంబంధిత బ్యాంకుశాఖను కోరడం, వెనువెంటనే ఆయన వ్యవహారాల వివరాలు వెల్లడించలేనని, దీనిపై శనివారం సుబ్బారెడ్డి తరపున న్యాయవాది హైకోర్టులో పిటిషన్‌దాఖలు చేశారు. కల్తీనెయ్యి కేసులో సిట్ దర్యాప్తు వేగంగా సాగుతున్న తరుణంలో సుబ్బారెడ్డి హైకోర్టును ఆశ్రయించడం కీలకపరిణామంగా మారింది. కల్తీనెయ్యిలో సుబ్బారెడ్డిని ఇంతవరకు విచారణ చేయలేదని సిట్ హైకోర్టుకు తెలిపిన సమాచారం. మరీ నేడు హైకోర్టులో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోనున్నాయనేది తెలియాల్సి ఉంది.

## ఆకాశదీపాన్ని వెలిగించిన ఇఓ దంపతులు



శ్రీకాళహస్తి,నవంబర్ 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా నిర్వహిస్తున్న ఆకాశదీపం కార్యక్రమాలను ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు.ఒక్కొక్క రోజు ఒక్కొక్క విఐపిచే ఆకాశ దీపాన్ని ఆవిష్కరించటం జరుగుతుంది. ఈనేపథ్యంలో ఆదివారం ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి దంపతులు ఆకాశదీపాన్ని ఆవిష్కరించారు. సాయంత్రం కోట మండపం వద్ద ఆలయ పౌరోహితులు అర్థగిరి స్వామి వేదమంత్రాలను పఠిస్తుండగా స్థానిక సంప్రదాయం ఆచారం మేరకు ఆకాశదీపాన్ని ఆవిష్కరించి పూజలు జరిపారు.

## కపిలేశ్వరునికి బిల్వాలతో అర్చన

### -వేదోక్తంగా నిర్వహించిన అర్చకులు



తిరుపతి, నవంబర్ 9 ప్రభాతవార్త:

కపిలేశ్వర ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం ఉదయం శాస్త్రోక్తంగా లక్షబిల్వార్చన నిర్వహించారు. ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు బిల్వార్చన అర్చకులు జరిపించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

# లక్ష కోట్ల ఆస్తి వృధా : పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు, నవంబర్ 9 ప్రభాతవార్త



పట్టణంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న జరగనున్న ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలకు లక్ష కోట్ల రూపాయల విలువైన ఆస్తి మెడికల్ కళాశాలల రూపంలో లభించిందని అన్నారు. జగన్ ఒకేసారి 17 వైద్య కళాశాలలను ప్రారంభించడం చారిత్రాత్మకమని, రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తే అవి పూర్తిగా ప్రజల సేవలోకి వస్తాయని తెలిపారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కళాశాలలను ప్రైవేటీకరించే ప్రయత్నం చేయడం పేదలకు వైద్య విద్యను దూరం చేస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వైద్య విద్య కొనసాగితేనే పేదలకు మేలు జరుగుతుందని పెద్దిరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 12న నియోజకవర్గ స్థాయిలో ర్యాలీ నిర్వహించి, అనంతరం రాష్ట్ర గవర్నర్‌కు వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, రాష్ట్ర కార్యదర్శులు అనీషారెడ్డి, కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఏకపక్ష నిర్ణయాలతో పార్టీకి నష్టం

### శంకర్‌రెడ్డి ముద్దు...!న వైసీపీ జడ్పీటీసీ వర్గం చంద్రశేఖర్‌రెడ్డి వద్దు..
### న అక్రమ చొరబాటుదారులతో తీవ్ర నష్టం: మండల టీడీపీ నాయకుల ఆవేదన

సత్యవేడు, నవంబరు 9 ప్రభాతవార్త:

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధిష్టానం పంపే ప్రతి ఒక్కరికి మేం సహకరిస్తున్నాం. అయితే తాజాగా వచ్చిన పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి తీసుకునే ఏకపక్ష నిర్ణయాలకు పార్టీ తీవ్రంగా నష్టపోతుందని పలువురు మండల టీడీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు అధికార దాహంతో పార్టీలోకి వచ్చిన వారి వ్యవహార శైలితో ద్వితీయ శ్రేణి నాయకులు ఇబ్బందులకు గురవుతున్నారని, మరి కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక మండల టీడీపీ నేత ప్రవీణ్‌రెడ్డి స్వగృహంలో కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డితో మాకు ఎలాంటి విబేధాలు లేవని, కొన్ని ఏకపక్ష నిర్ణయాలు, తాజాగా పార్టీలోకి వచ్చిన జడ్పీటీసీ భర్త చంద్రశేఖర్‌రెడ్డి వ్యవహార శైలితో మండలంలో సీనియర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి మద్దతుదారులు కార్యాలయాల్లో పెత్తనం సాగిస్తూ టీడీపీ శ్రేణుల అభ్యర్థనలు, ఆవేదనలు, సమస్యలు పట్టించుకునే దిక్కు లేదని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జడ్పీటీసీ పదవికి రాజీనామా చేయకుండా ఆయనకు టీడీపీలోకి చేర్చుకోవడంతోనే సమస్యలు వచ్చాయని పలువురు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కాలమనాయుడు పేటలో ఇళ్ళ స్థలాన్నీ వైసీపీ వారికే చేరిందని, టీడీపీ నాయకులు సూచించిన వారికి, ఇతరులకు సెంటు స్థలం దక్కకుండా పోయిందన్నారు. ఆ ఇళ్ళ స్థలాల పంపిణీలో భారీగా అక్రమాలు జరిగాయని కూడా సమావేశం దృష్టికి కొందరు తీసుకొచ్చారు. అంబాకంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతున్న ఆయనకు జడ్పీటీసీ మద్దతు పలకడం ఎంత వరకు సబబుగా ఉందో అర్థం చేసుకోవాలని తెలియజేశారు. అమావాస్యరెడ్డి కండ్రిగలో దాదాపు పదేళ్లుగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఉన్న అతనిని ఆగ మేఘాలపై తప్పించడం ఎంత వరకు న్యాయమంటూ మరికొందరు మండల నాయకులను ప్రశ్నించారు. వైసీపీలో ఉన్నప్పుడు ఇదే చంద్రశేఖర్‌రెడ్డి అనేక మంది టీడీపీ నాయకులను తప్పుడు ఫిర్యాదులతో వేధించడం అందరికి తెలుసునని, అప్పట్లో కేసులు పెట్టి ఇప్పుడు మా అన్న శంకర్‌రెడ్డి అన్ని నాకే కావాలి...నేను చెప్పినట్లే జరగాలి మండలం పూర్తిగా అనే విధంగా చంద్రశేఖర్‌రెడ్డి దూసుకుపోవడం మూలంగా పార్టీ తీవ్రంగా నష్టపోతుందని పలువురు మండల నాయకులు సమావేశంలో గగ్గోలు పెట్టారు. నామినేట్ పదవులు కూడా శంకర్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయాలతో భర్తీ చేయడం వల్ల స్థానిక ఎన్నికల్లో పార్టీ తీవ్రంగా నష్టపోవడం తథ్యమని మరికొందరు వాపోయారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యవేడు మండల పార్టీ అధ్యక్షుడు

# కొత్తగా మరో జిల్లా ఏర్పాటు

### - చిత్తూరు జిల్లా మరింత కుదింపు- మదనపల్లి జిల్లా ఏర్పాటుకు ప్రతిపాదనలు

చిత్తూరు, నవంబర్ 9 ప్రభాతవార్త:

ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాంతంను గత వైకాపా ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో మూడు కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం మరోసారి జిల్లాలను పరిపాలనా సౌలభ్యం మేరకు విభజించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో మదనపల్లి కేంద్రంగా మరొక కొత్త జిల్లా ఏర్పాటు కానుండగా, ప్రస్తుతం వున్న చిత్తూరు జిల్లా పరిధి మరింత కుదించబడనుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా 65 మండలాలతో విస్తీర్ణంలో పెద్ద జిల్లాగా వుండేది, ఇటు కుప్పం నుండి అటు విజయపురం వరకు విస్తరించి వుండేది. ఈ క్రమంలో గత వైకాపా ప్రభుత్వ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల పునర్విభజనలు చేయడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా మూడు ముక్కలు అయ్యింది. చిత్తూరు కేంద్రంగా 31 మండలాలను చిత్తూరు జిల్లా ఏర్పాటు కాగా, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కొన్ని మండలాలను తిరుపతి బాలాజీ జిల్లాలో కలిపి పూర్వ నెల్లూరు జిల్లాలోని కొన్ని మండలాలను కలిపి కొత్తగా తిరుపతి బాలాజీ జిల్లాను ఏర్పాటు చేశారు. అలాగే మదనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొన్ని మండలాలను ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి విడదీసి అన్నమయ్య రాజంపేట జిల్లాగా ఏర్పాటు చేశారు. ఈ జిల్లాలో మదనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొన్ని మండ లాలు, ఇది వరకు వున్న కడప జిల్లాలోని కొన్ని మండలాలను కలిపి కొత్తగా అన్నమయ్య రాజంపేట జిల్లాను ఏర్పాటు చేశారు. ఈ పరిస్థితుల్లో ఇప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మరోసారి జిల్లాలను పునర్విభజించాలని కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని కొన్ని మండలాలను కుదించనున్నారు. ఈ జిల్లాలో ప్రస్తుతం నగరి నియోజకవర్గ పరిధిలోని కొన్ని మండలాలు వుండగా ప్రస్తుత పునర్విభజనలో నగరి నియోజకవర్గం పూర్తిగా చిత్తూరు జిల్లా నుండి వేరు కానుంది. అలాగే చిత్తూరు జిల్లాలో పుంగనూరు నియోజకవర్గం సైతం వుండేది. ఇది వరకు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో చిత్తూరు జిల్లా ఏర్పాటు కాగా ప్రస్తుతం ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలతో చిత్తూరు జిల్లా కుదించబడనుంది. అంటే నూతనంగా ఏర్పాటు కానున్న చిత్తూరు జిల్లాలో కేవలం ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే వుండనున్నాయి. జిల్లా కేంద్రం చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు పూతలపట్టు, జిడినెల్లూ రు, పలమనేరు, కుప్పం అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే చిత్తూరు జిల్లాలో వుండనున్నాయి. మరోవైపు ఇది వరకు అన్నమయ్య రాజంపేట జిల్లాలో వున్న మదనపల్లి ప్రస్తుత జిల్లాలో పునర్విభజనలో మరో కొత్త జిల్లాగా ఏర్పాటు కానుంది. మదనపల్లి కేంద్రంగా మదనపల్లి, పీలేరు, పుంగనూరు, తంబళ్ళపల్లి అసెబ్లీ నియోజకవర్గాల పరిధితో కొత్తగా మదనపల్లి జిల్లా ఏర్పాటు కానుంది. అలాగే శ్రీ బాలాజీ తిరుపతి జిల్లా తిరుపతి, శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గాలతో ఏర్పాటు కానుంది. ప్రస్తుతం పునర్విభజించిన చిత్తూరు జిల్లాలో చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని చిత్తూరు, చిత్తూరు రూరల్, జిడినెల్లూరు, గుడిపాల, ఐరాల, పెనుమూరు, పూతలపట్టు, ఎస్‌ఆర్ పురం, తవణంపల్లి, వెదురుకుప్పం యాదమరి మండలాలు వుండనున్నాయి. అలాగే కుప్పం రెవెన్యూ డివిజన్ పరిధిలోని కుప్పం, రామకుప్పం, గుడిపల్లి, శాంతిపురం మండలాలు వుండనున్నాయి. అలాగే నగరి రెవెన్యూ డివిజన్ పరిధిలో కార్వేటినగరం, నగరి, నింద్ర, పాలసముద్రం, విజయపురం మండలాలు వున్నాయి. అలాగే పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యం, చౌడేపల్లి, నగరి, పలమనేరు, కుప్పం మండలాలు వున్నాయి. ప్రస్తుతం కుదించనున్న కొత్త చిత్తూరు జిల్లాలో నగరి నియోజకవర్గ పరిధిలోని మండలాలు పూర్తిగా మాయం కానున్నాయి. అలాగే పుంగనూరు నియోజకవర్గ పరిధిలోని మండలాలు మదనపల్లి జిల్లాలో కలవనున్నాయి.

## చిత్తూరులో జోయాలుక్కాస్ బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో

చిత్తూరుహెల్త్, నవంబర్ 9 ప్రభాతవార్త:



చిత్తూరు హైరోడ్డులోని జోయాలుక్కాస్‌లో శుక్రవారం బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో ప్రారంభమైంది. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ గ్రూప్ ఆఫ్ ఛైర్మన్ డాక్టర్ జాయ్ అలుక్కాస్ మాట్లాడుతూ బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షోలో నాణ్యమైన వజ్రాల డిజైన్లను పొందుపరచడం జరిగిందని, ఈ నెల 23వ తేదీ వరకు జరగనున్న ఈ ప్రత్యేక జ్యువెలరీ షోలో ఒక లక్ష రూపాయలకు ఆభరనాలు కొనుగోలు చేసిన వారికి ఒక గోల్డ్‌కాయిన్ ఉచితంగా ఇవ్వనున్నామన్నారు. జోయాలుక్కాస్ ప్రయాణంలో చిత్తూరు నగరంకు ప్రత్యేక స్థానం వుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, సినీ నటీ దివి వాద్య పాల్గొని బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షోను ప్రారంభించారు.

## ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యకు సత్వర పరిష్కారం

– జిల్లా యుటిఎఫ్ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జివి రమణ డిమాండ్

చిత్తూరు, నవంబర్ 9 ప్రభాతవార్త:



రాష్ట్రంలో వివిధ రకాల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు సరైన సర్వీసు రూల్స్ లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సత్వరం ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను కల్పించాలని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ డిమాండ్ చేశారు. జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ సర్వీసు రూల్స్ లేకపోవడంతో డిఇఓ, డిప్యుటీ డిఇఓ వంతి క్రియాశీలమైన పాఠశాలల్లో తనిఖీ చేయాల్సిన పోస్టుల్లో ఒక్క ఉపాధ్యాయుడు పదోన్నతి పొందకపోవడం శోచనీయమన్నారు. జిఓ 243ను రద్దు చేయడంతో పాఠశాల విద్య నుండి కళాశాల విద్యను విడదీయడం వల్ల జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం లేదని ఆరోపించారు. అలాగే నాన్ టీచింగ్ సిబ్బందికి జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించడం, అదే పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యా యులకు ఆ అవకాశం కల్పించకపోవడం శోచనీయమన్నారు. అలాగే టెట్ నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. మెగా డిఎస్సీ అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,043 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వున్నాయని, ఈ పోస్టులను సత్వరం భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్‌లు, యుటిఎఫ్ నాయకులు రెహెనాబేగం, కె.రెడ్డప్పనాయుడు, ఎస్పీ భాషా, కె.సరిత, కృష్ణమూర్తి, పార్థసారధి, పంటపల్లి సురేష్, కె.గణేష్‌కుమార్, బాబు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సికె లావణ్య పుట్టినరోజు

చిత్తూరుహెల్త్, నవంబర్ 9 ప్రభాతవార్త:



మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం నాయకులు సికె బాబు సతీమణి సికె లావణ్యబాబు జన్మది నంను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కట్టమంచిలోని సికె బాబు స్వగృహంలో సికె లావణ్యబాబు కేక్ కట్ చేసి మాజీ ఎమ్మెల్యే సికె బాబుకు తినిపించారు. ఈ సందర్భంగా సికె లావణ్యబాబును పలువురు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు సంతకాల సేకరణ

**శ్రీకాళహస్తి,నవంబర్ 9 ప్రభాతవార్త**రాష్ట్ర ప్రభుత్వం అమలుకు పూనుకున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలను మైనారిటి నాయకుడు పఠాన్‌ఫరీద్ ఖాన్ సారధ్యంలో నిర్వహించారు. స్థానిక వైకాపా నాయకుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆదేశాలతో వాడ వాడల్లో పార్టీ కార్యకర్తలు,ద్వితీయ శ్రేణి నాయకులు ప్రజల వద్దకు సంతకాల సేకరణకు పరుగులు తీస్తున్నారు. ఈ నేపధ్యంలో 18వ వార్డులో మైనారిటి ముస్లింలు నివాస ముంటున్న ప్రాంతాల్లో సంతకాల సేకరణను పఠాన్ ఫరీద్ ఖాన్‌సారధ్యంలో సంతకాలు సేకరించారు.నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలతో ప్రజలను నిట్టనిలువునా ముంచేస్తున్నారని ప్రజలు గమనించాలని వివరించారు.ఈ సంతకాల సేకరణలో ఫరీద్ ఖాన్‌తో పాటు పెరుమాళ్, షేక్ అస్లం, సాధిక్‌బాషా, షేక్ షామీర్,మణి, మునెమ్మ, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా పనితీరు

–టిటిడి ఉద్యోగుల సంక్షేమ కమిటీ నూతన అధ్యక్షుడుగా చీర్లకిరణ్



**తిరుమల,నవంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో అంకితభావంతో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తామని, అందుకుతగ్గట్లు ఉద్యోగులకు చేరువై వారి సమస్యలు పరిష్కరిస్తామని టిటిడి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఉద్ఘాటించింది. టిటిడి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం సమావేశమైంది. సభ్యులందరూ ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు .నూతన అధ్యక్షుడుగా చీర్లకిరణ్ , అసోసియేషన్ అధ్యక్షుడుగా శ్రీహరిచౌదరి, ప్రధాన కార్యదర్శిగా వంకీపురం పవన్, కోశాధికారిగా గుంటూరు రేఖ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంట భరత్, అదనపు కార్యదర్శిగా మణికంఠ, ఉపాధ్యక్షులుగా సునీల్‌కుమార్‌యాదవ్, కొప్పర్తి శివ, ఈశ్వర్‌నాయక్, ఈశ్వరయ్య, విశ్వనాథం, ,పార్థసారధి, వెంకటరమణ, ధరణీకుమార్, గౌరవ సలహాదారులుగా చిన్నంగారి సూరిబాబు, అశోక్‌కుమార్, కోలా గిరి, జి.శ్రీనివాసరావు, చంద్రకుమార్, చంద్రకిరన్,మదన్, సుబ్రమణ్యం, రంగాచార్యులు, డిప్యూటీ కార్యదర్శులుగా ,సంయుక్తకార్యదర్శులుగా, పాలకవర్గం సభ్యులుగా మరో 30మందిని ఎన్నుకున్నారు. టిటిడి బోర్డు, ఉన్నతాధికారులతో కలసి ఉద్యోగులకోసం పనిచేస్తామన్నారు.

## డీఎస్పీ లైవ్ కాన్సర్ట్‌తో చరిత్ర సృష్టించిన తెలుగు కళా సమితి

**తిరుపతి విద్య. నవంబర్ 9 ప్రభాత వార్త:** కువైట్ లో తెలుగు సమాజం కళా, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ తెలుగు కళ సమితి నిర్వహించిన డీఎస్పీ లైవ్ అండ్ కువైట్ కార్యక్రమం సాంస్కృతిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిం ది.మన్సొరియాలోని అల్ అరబీ స్పోర్ట్స్ క్లబ్‌లో నిర్వహించిన ఈ కచేరీకి 5,000 మందికి పైగా సంగీతాభిమానులు హాజర కావడంతో కువైట్ లో ఎక్స్ పాట్ కమ్యూనిటీలో ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద ఈవెంట్‌గా ఇది రికార్డుల్లో నిలిచింది. భారతీయ సినీ ప్రపంచంలో సంచలన సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ తన ఎనర్జిటిక్ ప్రదర్శనలతో వేదికను కదిలించాడు.తొలి బీట్ మొదలుకొని చివరి నోటు వరకు ప్రేక్షకులు నిలబడి పాటలతో పాటు నృత్యం చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో డీఎస్పీ అందించిన సూపర్‌హిట్ పాటలు కువైట్ రాత్రిని సంగీత మహోత్సవంగా మార్చాయి.ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా హాజరైన తిరుపతి తుడా చైర్మన్ సి. దివాకర్ రెడ్డి, కువైట్‌లో తెలుగు సమాజం ప్రదర్శిస్తున్న ఐక్యత,సామాజిక స్ఫూర్తిని అభినందించారు. బహుళ సాంస్కృతిక వాతావరణంలో తెలుగు సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చినందుకు టికెఎస్‌ను శ్లాఘించారు.





## అభివృద్ధి పరుగులు

పాలసముద్రం, నవంబర్ 9 ప్రభాతవార్త

: పాలసముద్రం లోని అయ్యప్పరాజు కండిగ గ్రామం చిత్తూరు – బలజ కండిగ రహదారికి అనుకుని సుమారు 450 మీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామం ఏర్పడి సుమారు 300 సంవత్సరాలు అయినా ఇంతవరకు ఈ గ్రామానికి సరైన రహదారి లేదు. వర్షాకాలం వస్తే అంతా బురదమయమే. గుంతలతో కూడిన మట్టి రోడ్డు ఉండడంతో ప్రజలు నడిచి వెళ్లాలన్న ద్విచక్ర వాహనంపై వెళ్లాలన్న ఎక్కడ కింద పడతామో అని భయపడుతూ వెళ్లేవారు. గతంలో ఎన్నో సార్లు నాయకులకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా వీరికి మాత్రం శాశ్వత దారి ఏర్పాటు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్‌కు గ్రామానికి చెందిన కొంతమంది యువత సమస్యలపై వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే 450 మీటర్ల సిమెంట్ రోడ్డు వేయడానికి సుమారు 28 లక్షల నిధులను విడుదల చేయించి రోడ్డు నిర్మాణం కూడా పూర్తిచేయించారు. దీంతో ఎమ్మెల్యేకు అయప్పరాజుకండ్రిగ కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుండి కాణిపాకంలో పవిత్రోత్సవాలు

కాణిపాకం, నవంబర్ 9 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 10 నుండి 12 వరకు స్వామివారికి మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఈమేరకు ఈనెల 10న సోమవారం సాయంత్రం 5గంటలకు అనుజ్ఞ, విఘ్నేశ్వరపూజ, వాస్తు శాంతి, పుణ్యాహావాచనం, మృత్సంగ్రహణం, రక్షాబంధనం, స్థండిల మండలేశ్వర పూజ, గంధపవిత్ర సమర్పణ విశేష ద్రవ్యాహుతి, పూర్ణాహుతి, దీపారాధన, ప్రసాద వినియోగం వుంటుందన్నారు. అలాగే 11న మంగళవారం ఉదయం 8 గంటలకు విశేషసంధి,రెండవ కాలపూజ స్థండిల మండలేశ్వర పూజ, పూజ, వత్ర సమర్పణ, రెండవ కాల వత్ర సమర్పణ, విశేష ద్రవ్యాహుతి, పూర్ణాహుతి, ధీపారాధన, ప్రసాద వినియోగం, సాయంత్రం 5 గంటలకు విశేషసంధి, మూడవకాలపూజ, స్థండిల మండలేశ్వర పూజ, హోమం, వ్రత సమర్పణ, మూడవ కాల వ్రతసమర్పణ, విశేష ద్రవ్యాహుతి, దీపారాధన, ప్రసాద వినియోగం పూజలు వుంటుందన్నారు. అలాగే 12న బుధవారం ఉదయం 6.30 గంటలకు అపబృద యాగపూజ, స్థండిల మండలేశ్వర పూజ, హోమం, వ్రత సమర్పణ, మహా పవిత్ర సమర్పణ,విశేష ద్రవ్యాహుతి, మహాపూర్ణాహుతి, విశేష ద్రవ్యాహుతి, మహా పూర్ణాహుతి, మహా దీపారాధన జరుగుతాయని ఈఓ తెలిపారు.

## 11న తేదీ శ్రీ సీతారామ ఆంజనేయ పిరమిడ్ ప్రారంభోత్సవం

**కల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం కమ్మపల్లెలో ఈ నెల 11వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు శ్రీ సీతారామ ఆంజనేయ పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.అందరూ పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకుల కోరారు.

## శ్రీనివాసులు శెట్టి భౌతిక కాయానికి నివాళులర్పించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కల్లూరు, నవంబర్ 9, ప్రభాతవార్త

పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన వ్యాపారవేత్త శ్రీనివాసులు శెట్టి భౌతికయానికి మాజీ మంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాళులర్పించారు. వ్యాపారవేత్త శ్రీనివాసులు శెట్టి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఎంపీపీ సురేందర్ నాథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మునీర్ ఖాన్, ఇండియన్ గ్యాస్ డీలర్ వంశీకృష్ణ, నిరంజన్ రెడ్డి, సన్నిహితులు శ్రేయోబి. లాషులు శ్రీనివాసులు శెట్టి భౌతికయానికి నివాళులర్పించారు.

## పవన్ కళ్యాణ్‌ను కలిసిన సింగిల్ విండో రమణ



పుంగనూరు నవంబర్ 9 ప్రభాతవార్త

సింగిల్ విండో అధ్యక్షుడు పగడాల రమణ, ఆదివారం చిత్తూరు జిల్లా పలమనేరు లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిశారు. పవన్ కళ్యాణ్ ఏనుగుల సంరక్షణ, అటవీ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ అంశాలపై సమీక్షా సమావేశంలో పాల్గొని అనంతరం ప్రజలను కలిశారు. ఈ సందర్భంగా పగడాల రమణ హెలిప్యాడ్ వద్ద పవన్ కళ్యాణ్‌ను పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పుంగనూరు వ్యవసాయ రంగం, రైతుల సమస్యలు, మార్కెట్ సదుపాయాలపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పవన్ కళ్యాణ్ పుంగనూరు అభివృద్ధికి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## డి.సిఎం పవన్‌కు కలసిన పికెఎం ఉడా ఛైర్మన్

కుప్పం, నవంబర్ 9 ప్రభాతవార్త

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ఆదివారం పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు. పలమనేరు ముసలిమడుగు ఎలిఫెంట్ క్యాంప్‌కు విచ్చేసిన డి.సిఎం పవన్ కళ్యాణ్‌కు డా॥ సురేష్‌బాబు హెలిప్యాడ్‌లోఘనస్వాగతం పలికారు. అలాగే డి.సిఎంను కుప్పం జనసేన సమన్వయకర్త నరేష్‌సైతం కలిశారు.





## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కుప్పం, నవంబర్ 9 ప్రభాతవార్త

నియోజకవర్గ స్థాయిలో సోమవారం కుప్పంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈసోమవారం రద్దు చేసినట్లు కడ పి.డి.వికాస్ మర్మత్ తెలిపారు. అనివార్య కారణాలతో కార్యక్రమం రద్దయిందన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

## షాదీఖానా ఛైర్మన్‌ను సత్కరించిన డా॥ సుధీర్

కుప్పం, నవంబర్ 9 ప్రభాతవార్త

కుప్పం షాదీఖానా ఛైర్మన్‌గా నియమితులైన సర్దార్ బాషాను కుప్పం మున్సిపల్ మాజీ ఛైర్మన్, శ్రీప్రియ నర్సింగ్ హోం అధినేత డా॥ సుధీర్‌ఘనంగా సత్కరించారు. ఈసందర్భ ంగా డా॥ సుధీర్ మాట్లాడుతూ సీనియర్ నేత అయిన సర్దార్‌కు పదవి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మైనార్టీ ప్రజలకు నూతన పాలకవర్గం అండగా ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామాల్లో కళాజాత



కుప్పం,నవంబర్ 9 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ప్రజల్లో తీసుకెళ్లాలని నిర ్ణయించింది. ఇందుకు సంబంధించి గ్రామాల్లో రాత్రిపూట కళాకారులచే కళాజాత కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని 89 పంచాయతీల్లోను ఈకార్యక్రమం నిర్వహించేలా సన్నద్ధమయ్యారు. ఇటీవలే శాంతిపురం మండలంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం కుప్పం మండలంలోని గ్రామీణ పంచాయతీల్లో కళాజాత కార్యక్రమాలు జరుగుతున్నాయి. తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, రోడ్లు, డ్రైన్లు, సోలార్ వీధి లైట్లు, గోకులం షెడ్లు, ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు, కుప్పానికి హంద్రీ–నీవా జలాలు రావడం వంటి కార్యక్రమాలపై కళాకారులు పాటల రూపంలో గ్రామాల్లో కళాజాత నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రజలు కూడా గ్రామాల్లో ఉత్సాహం చూపుతున్నారు.

## తెదేపా కార్యవర్గాల ప్రమాణస్వీకారం

వి.కోట, నవంబర్ 9 ప్రభాతవార్త

వి.కోట మండల తెలుగుదేశం పార్టీ మండల, గ్రామ పంచాయతీ కార్యవర్గాల ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారంఘనంగా నిర్వహించారు. స్థానిక పిఎంఆర్ కళ్యాణ మండపంలో జరిగిన ఈకార్యక్రమంకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరయ్యారు. మండల టిడిపి అధ్యక్షుడిగా రాంబాబు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం 2026టిడిపి కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పికె ఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్, మాజీ ఎఎంసి ఛైర్మన్ రామచంద్రనాయుడు, బాలాజీ సూపర్ బజార్ ఛైర్మన్ ఆర్‌వి బాలాజీ, స్థానిక నేతలు పాల్గొన్నారు.



## మానిటరింగ్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం

రామకుప్పం, నవంబర్ 9 ప్రభాతవార్త



కుప్పం డివిజన్ ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యు లు కృష్ణానాయక్, జయశంకర్‌లను కూటమి నేతలు ఘనంగా సత్కరించారు.ఉన్సిగానిపల్లిలో ఈకార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, నేతలు రామూర్తి,శ్రీనివాసులురెడ్డి, మనీష్, సుభాష్, మహేంద్ర నాయుడు, బీరప్పగౌడు, షణ్ముగం, మంజునాథాచారి, కృష్ణారెడ్డి, కేశవులు, గోపాల్‌రెడ్డి, శంకరాచలం, రామలింగం పాల్గొన్నారు.

## నేడు పోలీసు పబ్లిక్ గ్రీవెన్స్

చిత్తూరుహెల్త్, నవంబర్ 9 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజలు హాజరై తమ సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి వారు సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారు.

## ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యకు సత్వర పరిష్కారం

– జిల్లా యుటిఎఫ్ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జివి రమణ డిమాండ్

**చిత్తూరు, నవంబర్ 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వివిధ రకాల పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు సరైన సర్వీసు రూల్స్ లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సత్వరం ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను కల్పించాలని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ డిమాండ్ చేశారు. జిల్లా యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ సర్వీసు రూల్స్ లేకపోవడంతో డిఇఓ, డిప్యుటీ డిఇఓ వంతి క్రియాశీలమైన పాఠశాలల్లో తనిఖీ చేయాల్సిన పోస్టుల్లో ఒక్క ఉపాధ్యాయుడు పదోన్నతి పొందకపోవడం శోచనీయమన్నారు. జిఓ 243ను రద్దు చేయడంతో పాఠశాల విద్య నుండి కళాశాల విద్యను విడదీయడం వల్ల జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం లేదని ఆరోపించారు. అలాగే నాన్ టీచింగ్ సిబ్బందికి జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించడం, అదే పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఆ అవకాశం కల్పించకపోవడం శోచనీయమన్నారు. అలాగే టెట్ నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్‌లు, యుటిఎఫ్ నాయకులు రెహెనాబేగం, కె.రెడ్డప్పనాయుడు, ఎస్పీ భాషా, కె.సరిత, కృష్ణమూర్తి, పార్థసారధి, పంటపల్లి సురేష్, కె.గణేష్‌కుమార్, బాబు, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వరసిద్దుని దర్శించుకున్న అసిస్టెంట్ కలెక్టర్

కాణిపాకం, నవంబర్ 9 ప్రభాతవార్త:



చిత్తూరు అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడేల్ దంపతులు ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయంలో రాజగోపుం వద్ద ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అర్దగిరి సన్నిధిలో రాష్ట్ర లోకాయుక్త జడ్జి

తవణంపల్లె, నవంబర్ 9 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్దగిరి శ్రీవీరాంజనయ స్వామివారిని రాష్ట్ర లోకాయుక్త జడ్జి రజిని ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకు న్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయంలో రాజగోపుం వద్ద ఆలయ ఈఓ ఇ.మునిశేఖర్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి మండపంలో అర్చకులు ఆశీర్వచనం చేయగా ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని,సంజీవరాయనిపుష్కరిణి తీర్థాన్ని అందజేశారు.వారి వెంట ప్రోటోకాల్ అధికారులు పాల్గొన్నారు



## స్వామివారి దర్శనానికి ఆటంకం కల్పిస్తున్నారు



గిరినాథ్ ప్రకాష్

చౌడేపల్లి, నవంబర్ 9 ప్రభాతవార్త

దేవస్థానం నిర్మాణాన్ని సొంత నిధులతో చేపట్టానని, అయితే దర్శనానికి ఆటంకం కల్పిస్తున్నారని పారిశ్రామికవేత్త గిరినాథ్ ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేసారు. మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ గాండ్లపల్లిలో గల అభయాంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో గ్రామస్తులతో సమావేశాన్ని ఏర్పాటు చేసారు. తన సొంత గ్రామమైన గాండ్లపల్లిలో కొద్దిపాటి విస్తీర్ణంలో బండ్లతోకూడిన అభయాంజనేయస్వామి ఆలయముండేదన్నారు. 1990లో తాను స్థితిమంతుడయ్యాక ఆలయాన్ని సంపూర్ణంగా నిర్మించానని, అప్పటి నుంచి ప్రతి ఆదివారం, పౌర్ణమి వేళల్లో స్వామివారికి వివిధ కైంకర్యాలతో పూజలు జరిపేవారమన్నారు. ముఖ్యంగా హనుమజ్జయంతిని వేడుకగా నిర్వహించుకొనేవారమని, అయితే కొన్నాళ్ళుగా తమ గ్రామంలోని వ్యక్తి స్వామివారి దర్శభాగ్యం కల్పించకుండా చేస్తున్నాడని ఆరోపించారు. తాను బెంగళూరులో స్థిరపడ్డప్పటికీ స్వామివారికి పూజలు ఆపలేదనీ, ఆలయానికి వస్తే దేవస్థానం తాళాలు వేసుకొని వెళుతున్నారన్నారు. పెద్దలు, గ్రామస్తులు సహకరించి తనకు అభయాంజనేయస్వామి దర్శనభాగ్యం కల్పించేలా చూడాలని ఆయన వారిని కోరారు. వి.రమణయ్య, ఎన్.ధామోధరం, కె.సరస్వతమ్మ, రత్నమ్మ, కె.సుబ్రమణ్యం, జె.రమణ, గంగులప్ప, బగ్గిడి వెంకట్రెడ్డి, జనార్ధన్‌రాజు గాండ్లపల్లితోపాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## నేడు మాజీ మంత్రి పెద్దిరెడ్డి మండల పర్యటన

చౌడేపల్లి, నవంబర్ 9 ప్రభాతవార్త

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 10న మండలంలో పర్యటించనున్నట్లు వైకాపా మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి తెలిపారు. మండలంలోని ఎ.కొత్తకోట, చారాల, దుర్గసముద్రం, చౌడేపల్లి, పుదిపట్ల, చింతమాకుపల్లి, పెద్దయల్లకుంట్ల, దిగువపల్లి, వెంగళపల్లి పంచాయతీల్లోని గ్రామాల్లోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. వైకాపా నాయకులు, పెద్దిరెడ్డి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

## శ్రీ రాముల వారి సేవలో చల్లా బాబు

పుంగనూరు రూరల్ నవంబర్ 9 ప్రభాతవార్త



మండలం భీమగానిపల్లి పంచాయతీ పరిధిలోని బోడినాయని పల్లిలో ఆదివారం శ్రీ సీతారామలక్ష్మణ హనుమత్ సమేత శ్రీ రామచంద్ర స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలయ ధర్మకర్త దామోదరం, గ్రామస్థులు సమష్టిగా ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథిగా పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి చల్లా బాబు రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన దేవాలయం నిర్మాణానికి కృషి చేసిన గ్రామస్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాధవ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ సెమీపతి, సీవీ రెడ్డి, శ్రీకాంత్, గిరి, చౌడేపల్లి మండల అధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి, రొంపిచర్ల మండల అధ్యక్షులు ఉయ్యాల రమణ, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడిగా పరంజ్యోతి

చిత్తూరురూరల్, నవంబరు 9 ప్రభాతవార్త:



రాష్ట్ర షెడ్యూల్ కుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడిగా డా.కీసరం పరంజ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య ఆద్వర్యంలో జరిగిన ఎన్నికల్లో గౌరవ అధ్యక్షులుగా నాగరాజ, రాష్ట్ర అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా బాబు, ప్రధాన కార్యదర్శిగా చిట్టిబబు, కోశాధికారిగా విజయ్, ఉపాధ్యక్షులుగా సుబ్రమణ్యం, వేలాయుధం, సంయుక్తకార్యదర్శిగా పవన్‌కుమార్, వెంకటేశులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలఉగా ఆదాం, మాధవన్, వజ్రవేలు తదితర కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

## కమ్మవారి కార్తీకవనభోజన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, నవంబరు 9 ప్రభాతవార్త:



కాణిపాకంపట్నంలోని రిసార్టులో ఆదివారం కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం అద్వర్యంలో జరిగిన కార్తీకవన భోజన మహోత్సవ కార్యక్రమానికి చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. సంఘ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి దుశ్శాలువతో సత్కరించి ఆయన చేత కేక్ కట్ చేయించిననంతరం ఎమ్మెల్యే తల్లిదండ్రులు రజని, గురజాల చెన్నకేశవులనాయుడులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ఇతర ప్రముఖులతో కలసి క్యాలెండర్ 2026ను ఆవిష్కరించి, పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో కమ్మవారి అభ్యుదయ సేవా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పింఛనుదారుల సమస్యల పరిష్కరించాలి

సదుం నవంబర్ 9 ప్రభాతవార్త



ప్రభుత్వ పింఛనుదారుల సమస్య లు ప్రభుత్వం పరిష్కరించాలని సదుం మండల ప్రభుత్వ పింఛనుదారులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సదుంలో ప్రభుత్వ పింఛను దారుల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పింఛను దారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, పింఛనుదారు పింఛనులో ప్రతినెలా నెలకు 300 రూపాయలు చొప్పున ప్రభుత్వం హెల్త్ స్కీమ్ అంటూ కట్టించుకుంటున్నారనీ చెప్పారు. ఆ హెల్త్ స్కీములో సరిగా న్యాయం జరగడం లేదని అభిప్రాయము వెలిబుచ్చారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు కూడా చాలా పెండింగ్‌లో ఉన్నాయని,త్వరగా క్లియర్ చేయాలని ప్రభుత్వా న్ని కోరారు.వి.నటరాజ, వి.రాజారెడ్డి కృష్ణారెడ్డి, మల్ రెడ్డి, మోహన్ రెడ్డి, సహదేవయ్య,తిమ్మయ్య,నాగరాజా,సుబ్రహ్మణ్యం,రామరాజు,రమణయ్య తదితరులు పాల్గొ న్నారు.

## ఘనంగా నాయుడమ్మ డెయిరీ ఫామ్ ప్రారంభం



**తిరుపతి విద్య, నవంబర్ 9 ప్రభాతవార్త:** నాయిడమ్మ డెయిరీ ఫార్మ్ ఆధ్వర్యంలో తుమ్మలగుంట రోడ్లో నూతనంగా ఏర్పాటు చేసిన పాలు,పెరుగు నెయ్యితో పాటు ఆహార పదార్థాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ కలిసితరహిత స్వచ్ఛమైన ఆవు,గేదె పాలు,నెయ్యి,పెరుగు వంటి వాటిని ప్రజలకు సరసమైన ధరలకు అందించడంతోపాటు పాల ఉత్పత్తులతో తయారుచేసిన ఆహార పదార్థాలను ఈ కేంద్రం ద్వారా ప్రజలకు అందించడం అభినందనీయమన్నారు.ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.నాయుడమ్మ డైరీ ఫామ్ అధినేత లక్ష్మీ భవాని మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో అన్ని కలుషితమవుతున్నాయని,స్వచ్ఛమైన ఆవు గేదె పాలు ప్రజలకు అందించాలని ఆకాంక్షతో ఆడపారెడ్డిపల్లిలో డైరీ ఫామ్ ను ఏర్పాటు చేసి తద్వారా తయారుచేసిన స్వచ్ఛమైన న్యాయమైన పాల ఉత్పత్తి పదార్థాలను ప్రజలకు అందించేందుకు నాయనమ్మ డైరీ ఫార్మ్ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు.తమ విక్రయ కేంద్రంలో స్వచ్ఛమైన నాణ్యమైన గేదె ఆవు పాలుతో పాటు నెయ్యి, తాజా పెరుగు తాజా పన్నీర్, జీరో శాతంతో పాలు పన్నీరు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కళా సంపదను భావితరాలకు అందించాలి

**తిరుపతి విద్య, నవంబర్ 9 ప్రభాతవార్త:**



భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల ప్రతిబింబించే కళలను పరిరక్షించి ఆ కళా సంపదను భావితరాలకు అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. గ్లోబల్ ఈవెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో గత రెండు రోజులగా మహతి కళాక్షేత్రంలో చేపట్టిన అన్నమయ్య సంగీత, నృత్యోత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ సంగీత, నృత్యోత్సవాలలో రాష్ట్రం నుంచే కాక తెలంగాణ,కర్ణాటక, తమిళనాడు నుంచి సుమారు 300 మందికి పైగా పాల్గొని తమదైన శైలిలో శాస్త్రీయ సంగీతాలాపన, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన ముగింపు సమావేశానికి టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోకుమార్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం,సిటీ చాంబర్ ప్రతినిధి అయూబ్ ఖాన్,బుల్లెట్ రమణ పాల్గొని ప్రసంగించారు.సాంప్రదాయ కళలు కనుమరుగవుతున్న నేపథ్యంలో అన్నమయ్య సంగీత,నృత్యోత్సవాలతో కళాకారులు, కళలను గ్లోబల్ ఈవెంట్స్ అధినేత కదిరి వెంకటరమణరావు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఈవెంట్స్ అధినేత వెంకటరమణరావు, ఇరముని శేఖర్, కళాకారులు, నాట్య గురువులు పాల్గొన్నారు.

## జంగమ సంక్షేమ సంఘ కార్తీక సమారాధన

**శ్రీకాళహస్తి, నవంబర్ 9 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి జంగమ సంక్షేమ సంఘం సారధ్యంలో ఆదివారం కార్తీకమాసం సమారాధన కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నిర్వహించారు. తెలుగుదేశం,జనసేన, బిజెపి పార్టీల కు చెందిన నాయకులు హాజరయ్యారు. ప్రతి ఏడాది కార్తీక మాసం సందర్బంగా జంగమ సంక్షేమ సంఘం వనభోజనాలు ఏర్పాటు చేయటం ఆనవాయితి.ఈ నేపధ్యంలో కార్తీక సమారాధన, వనభోజనంలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను భరద్వాజ తీర్థం ఆవరణలో ఏర్పాటు చేసారు.ఈ సందర్బంగా అతిధులు మాట్లాడుతూ జంగమ కలుస్థుల సంక్షేమ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రకటించారు.ఈ సందర్బంగా ఉసిరి చెట్టు కింద ఆరాధన,స్వామి అమ్మవార్ల పూజలు జరిపారు.ఈ కార్యక్రమాల్లో శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ, బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్, దేవస్థానం చైర్మెన్ కొట్టె సాయికుమార్,సభ్యులువిశాలాక్షి,జంగమసంక్షేమ సంఘం పెద్దలు రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతిచే పుస్తకావిష్కరణ

**శ్రీకాళహస్తి,నవంబర్ 9 ప్రభాతవార్త**



జ్యోతి రావు పూలే జాతీయ అవార్డు గ్రహీత అయ్యప్ప సేవా సమితి వ్యవస్థాపకులు గురు స్వామి కాళహస్తిచే రచించిన 'అయ్యప్ప స్వామి దీక్ష – నిత్యపూజా నియమావళి' అనే పుస్తకాన్ని ఆదివారం శ్రీకాళహస్తిలోని బహూదూరుపేటలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి, సర్వాత్మనంద స్వామిలచే ఆవిష్కరించారు.ఈ సందర్బంగా పుస్తకావిష్కరణ చేసినస్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దీక్షను సామాన్య దీక్షగా భావిస్తున్నారన్నారు. పూర్వ కాలంలో అయ్యప్ప స్వామి దీక్ష అంటే కఠోర దీక్ష అన్నారు.కార్తీక మాసంలో ఎంత విశిష్టంగా అయ్యప్ప దీక్షను పాటించేవారన్నారు. ఈ అంశాలను పుస్తక కర్త చక్కగా పొందుపరచారన్నారు. మారుతున్న కాలంలో మాలధారణ ఓ ఫ్యాషన్‌గా మారటం బాధాకరమన్నారు. నేడు మాలధారణ చేస్తున్న వారికి ఈ పుస్తకం ఓ దిక్సూచి అన్నారు. మాల దారణ ఎలా చేయాలి? ఎందుకు చేయాలి? మాలధారణ సందర్బంగా పాటించాల్సి న నియమాలు,పూజా విధానం, స్వామి వారి శరణ ఘోషలు ఈ దివ్యగ్రంధంలో పేర్కొనానని. అయ్యప్ప మాల ధారణ చేసినపుడు పాటించాల్సి న నియమాలను ప్రతి ఒక్కరుపాటించాలని స్వామి వివరించారు.ఈ నియమాలతో దీక్ష పాటిస్తే నిత్యజీవితంలో కూడా క్రమశిక్షణ జవాబుదారి తనం అలవడుతుందని విద్యాస్వరూపానందగిరి స్వామి వివరించారు.ప్రవచన కర్త అవధాని ఆముదాల మురళి పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం:

**శ్రీకాళహస్తి,నవంబర్ 9 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని పానగల్‌లో నాడు రాజాపానుగంటి నయనం వారు నిర్మించిన జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల శతవార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించుటకు పూర్వ విద్యార్థులు నిర్ణయించారు.ఈ మేరకు ఆదివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది.శ్రీకాళహస్తిలో ఉన్నత పాఠశాల స్థాపించి 104 సంవత్సరాలయ్యిందని వవెంకటయ్య వివరించారు. కాబట్టి శతవార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించుటకు పూర్వ విద్యార్థులు సహాకరించాలని కోరారు. వచ్చే సంవత్సరం శతవార్షికోత్సవ సంబరాలను నిర్వహించుటకు సమావేశం అభిప్రాయపడింది.ఇందుకు తాత్కాలిక కమిటిని ఎన్నుకున్నారు.ఈ సందర్బంగా ప్రధానోపాధ్యాయులు తీగల వవెంకటయ్య మాట్లాడుతూ తాను కూడా ఈ పాఠశాలలో చదువుకొని ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయులుగా రావటం తన సారధ్యంలో శతవార్షికోత్సవం సభలను నిర్వహించటం గర్వకారణమన్నారు.ఈసమావేశంలో ప్రధానోపాధ్యాయులతోపాటు పురుషోత్తం, గోపాలకృష్ణ, రామచంద్రయ్య, రంగయ్య, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**శ్రీకాళహస్తి,నవంబర్ 9 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న కార్తీక మాసం సందర్బంగా నెల రోజుల పాటు సాంస్కృతిక మాసోత్సవం దేవాదాయశాఖ ఆదేశాలతో నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు సంప్రదాయ నృత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందుకు రాజ గోపురం పక్కనే ప్రత్యేక సాంస్కృతిక వేదికను ఏర్పాటు చేసారు. ఆదివారం మండపంలో తిరుపతి,హైదరాబాదు కళాకారులు నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తిరుపతికిచెందిన పి.పుష్ప, జి.త్రిపుర,హైదరాబాదుకు చెందిన పి.దుర్గాభవాని నటరాజనృత్యనికేతన్ ద్వారా నృత్యప్రదర్శనలు నిర్వహించి ప్రేక్షకుల మన్ననలను అందుకున్నారు.వారికి దేవస్థానం తరపున సర్టిఫికేట్లు ఇఓ టి.బాపిరెడ్డి,మున్సిపల్ కమిషనర్ భవవాని ప్రసాద్‌లు అందించారు.

## మహిళ ప్రాంగణాన్ని దిగమింగిన వైకాపా నాయకులు

**శ్రీకాళహస్తి,నవంబర్ 9 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని ఆర్‌టిసి బస్టాండు సమీపంలో 1998లో అప్పటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సారధ్యంలో మహిళా ప్రాంగణానికి ప్రత్యేకంగా కృషి చేసి కేటాయిస్తే 2019-2024లో ఓ వైకాపాలో చేరిన నాయకుడు ఆక్రమించుకొని ప్రత్యేకంగా నిర్మాణాలు చేసారని బృందమ్మ పరిశీలించారు. శ్రీకాళహస్తి నడిబొడ్డులోని ఆర్‌టిసి బస్టాండు వెనుక భాగంలో మహిళలు సమావేశాలు జరుపుకొనుటకు ఇతరత్రా పార్టీ కార్యక్రమాలు,ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహాణకు ముందు చూపుతో మహిళా ప్రాంగణానికి స్థలం కేటాయించి నిర్మాణాలకు సంబంధించి నిధులు కేటాయించారన్నారు. కానీ భవన నిర్మాణం జరగకపోవటంతో కొందరు ఆక్రమణ దారులు ఆక్రమించుకున్నారని అయితే ఈ ఆక్రమణలపై త్వరలో రెవెన్యూ సారధ్యంలో సర్వేజ రిపి ఆక్రమణలను తొలగిస్తామని బృందమ్మ వివరించారు. వైకాపా హయాంలో ఎక్కడ చూసినా సమాజిక కార్యక్రమాలకు సంబంధించిన స్థలాలను అప్పనంగా ఆక్రమించుకున్నారని బృందమ్మ ఆవేదన వ్యక్తం చేసారు.

## కళత్తూరు నిర్వాసితులకు సహాయార్థం



సీపీఎం కార్యకర్తలు వస్తు సేకరణ

**పుత్తూరు రూరల్, నవంబరు 9 ప్రభాతవార్త:** కేవీబీ పురం మండలం కళత్తూరు నిర్వాసితులకు పుత్తూరు పట్టణంలో సీపీఎం పార్టీ కార్యకర్తలు వస్తువులు సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి జనార్ధన్, పుత్తూరు ప్రాంతీయ కార్యదర్శి వెంకటేష్‌లు మాట్లాడుతూ కేవీబీ పురం మండలం కళత్తూరు దళిత కాలనీ గత 6వ తేదీ సంభవించిన అకాల జలప్రళయానికి గురై సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవడం కొరకు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వస్తు సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పేదలకు ఉపయోగపడే వస్తువులు ఏదైనా సరే దానంగా ఇవ్వవచ్చని తెలిపారు. పుత్తూరు పట్టణంలో కొందరు దాతలు పెద్ద మనసుతో బట్టలు, వస్తువులు విరాళంగా ఇచ్చినందుకు వారికి సీపీఎం పార్టీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఇలాంటి ఆపదలు వచ్చిన సందర్భంలో సాటి మనిషికి సహాయ పడాలనే దృక్పథం అందరిలో కలగాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేష్, ముని శంకర్, మురుగేష్, అముదా, నందయ్య పాల్గొన్నారు.

## వడ్డెర సంఘం నియోజకవర్గ కమిటీ నియామకం

**రేణిగుంట, నవంబర్ 9 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నియోజకవర్గం వడ్డెర సంఘం కమిటీని తిరుపతి జిల్లా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నియమించినట్లు రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షులు, మాజీ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ళ మురళి, రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు, తిరుపతి జిల్లా అధ్యక్షులు దేవళ్ళ రమణ సంయుక్తంగా తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షులుగా చంద్రగిరి చంగలరాయలు, ప్రధాన కార్యదర్శిగా తమ్మిశెట్టి రవీంద్ర, ఉపాధ్యక్షులుగా చల్ల గంగరాజు ను నియమించినట్లు తెలిపారు. త్వరలో శ్రీకాళహస్తి నియోజకవర్గ వడ్డెర సంఘం కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా దేవళ్ళ రమణ మాట్లాడుతూ వడ్డెర కులస్తుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. తిరుమల, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి, అన్నవరం, తదితర పుణ్యక్షేత్రాల్లో వడ్డెర సంఘం సత్రాల నిర్మాణం కోసం సమావేశాలు, చర్చలు జరిపామన్నారు. త్వరలో అవి కార్యరూపం దాలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఘనంగా ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ లో 9 ఫెర్టిలిటి 2వ వార్షికోత్సవం



**తిరుపతి హెల్త్, నవంబర్ 9 ప్రభాతవార్త**

ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లోని 9 ఫెర్టిలిటి సెంటర్ వారు తమ 2వ వార్షికోత్సవాన్ని ఆనందంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవిఎఫ్, ఐయుఐ వంటి చికిత్సల ద్వారా సంతానం పొందిన 28 మంది తల్లులు తమ పిల్లలతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారందరినీ హాస్పిటల్ తరఫున ఘనంగా సత్కరించి, తల్లితనం యొక్క ఆనందాన్ని పంచుకున్నారు. తల్లులలో పలువురు మాట్లాడుతూ 'మేము ఎప్పటికీ తల్లులు కాలేమని అనుకున్నాం. కానీ 9 ఫెర్టిలిటి, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లోకి వచ్చిన తర్వాత డా. స్వప్న శ్రీనాథ్ ఇచ్చిన ధైర్యం, నమ్మకం మాకు తల్లితనం ప్రసాదించిందని భావోద్వేగంగా తెలిపారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ క్లినికల్ హెడ్ – 9 ఫెర్టిలిటి డా. స్వప్న శ్రీనాథ్ మాట్లాడుతూ నా రోగులను సంతోషంగా తల్లిదండ్రులుగా చూడడం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. ఎన్నో క్లిష్టమైన కేసులను చూసినా, ప్రతి రోగిని ఆరోగ్యవంతమైన తల్లిగా, తండ్రిగా మార్చడం నా లక్ష్యం అని అన్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ క్లస్టర్స్, ఆస్టర్ డిఎం హెల్త్‌కేర్ రీజినల్ సిఇఓ డా. హరి కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోగుల సంతృప్తి, ఫలితాల నాణ్యతే మా ప్రధాన లక్ష్యం. డా. స్వప్న శ్రీనాథ్ నైపుణ్యం, అంకితభావం ప్రశంసనీయమైనవి. ఆమె కృషి వల్లే 9 ఫెర్టిలిటి అత్యుత్తమ ఫలితాలను అందిస్తోంది అని అన్నారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డా. శ్రీధర్ ముని మాట్లాడుతూ మా హాస్పిటల్‌లో అత్యాధునిక ఫెర్టిలిటి యూనిట్‌తో పాటు అత్యుత్తమ వైద్య నిపుణుల బృందం పనిచేస్తోంది. రోగుల సంతృప్తి, విజయవంతమైన ఫలితాలే మా బలమని గర్వంగా చెప్పగలం. అధునాతన పరికరాలతో అన్ని రకాల ఫెర్టిలిటి సమస్యలను పరిష్కరించగల సదుపాయాలు మాకు ఉన్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో 9 ఫెర్టిలిటి, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ బృందం చురుకుగా పాల్గొని ఈ వేడుకను విజయవంతం చేశారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారు తమ రోగుల సంతోషమే నిజమైన విజయమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని విజయ గాథలను సృష్టించడమే తమ లక్ష్యమని తెలిపారు.

## కోసలనగరం గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం

**విజయపురం, నవంబరు 9 ప్రభాతవార్త:**



మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమ కోసలనగరంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలోఎంపీపీ మంజు బాలాజీ, వైస్ ఎంపీపీ కన్నెమ్మ, మండల అధ్యక్షులు శివరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి శేఖర్‌రాజు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గుణశేఖర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు సతీష్ యాదవ్, సుబ్బు యాదవ్, రవివర్మ, తదితరులతో పాటు వైసీపీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పాకాల, నవంబర్ 9, ప్రభాతవార్త**



పాకాల మండల మండలంలోని దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985 – 86వ సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. సుమారు 40 ఏళ్ళ తరువాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలను తెలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను ఓసారి గుర్తుకు తెచ్చుకొని సంబరపడ్డారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు జి. అన్నయ్య నాయుడు, కె సీతాపతి నాయుడు, విశ్వనాథరెడ్డి, టీవీఎస్, నందకుమార్, సులోచనాదేవి, సయ్యద్ బాషాపీర్, మనోహర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ సమన్వయకర్త పత్తిపాటి దేవరాజుల నాయుడు, ఎంఈఓ బాబ్జి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్‌సీపీలో చేరిన మాజీ వాలంటీర్లు

**పాకాల, నవంబర్ 9 ప్రభాతవార్త**



పాకాల పంచాయతీకి చెందిన మాజీ వాలంటీర్లు పది మంది వైఎస్ఆర్‌సీపీలో చేరారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చడంలో క్రియాశీలకంగా పనిచేసిన వాలంటీర్లను ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొనసాగిస్తామని, రూ.10 వేలు జీతం ఇస్తామని మోసం చేయడంతో తమను గౌరవించిన వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలుగా పనిచేసేందుకు ముందుకు వచ్చామని వాలంటీర్లు స్పష్టం చేశారు. పార్టీలో చేరేందుకు వచ్చిన వాలంటీర్లు అందరికీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానం పలికారు.

## గ్రూప్ థియేటర్స్ లో అప్ డే లీవ్ రిలీజ్



**తిరుపతి విద్య, నవంబర్ 9 ప్రభాత వార్త:** తిరుపతి గ్రూప్ థియేటర్స్ సముదాయంలో ఉన్న మినీ ప్రతాప్ థియేటర్ లో ద ఆఫ్ డే లీవ్ చిత్ర బృందం కళాకారులను ప్రోత్సహిస్తూ సినిమాలను పూర్తిస్థాయిలో తిరుపతిలో నిర్మించేందుకు సహాయ సహకారాలు అందిస్తున్న గ్రూప్ థియేటర్స్ అధినేత డాక్టర్ చదలవాడ కృష్ణమూర్తి అలాగే టిడిపి బీసీ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు వేలూరు జగన్నాథం,వారాహి డెవలపర్స్ అధినేత బాలాజీ ల ప్రోత్సాహంతో నేడు తిరుపతి వాసులచే ఒక కొత్త సినిమా అప్ డే లీవ్ తీయడం అదే సినిమా నేడు ప్రతాప్ థియేటర్ లో స్థానికులందరూ వీక్షించారు.ఈ సందర్భంగా బీసీ నాయకులు జగన్నాథం మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత నేడు రిలీజ్ అయిన ద హాఫ్ డే లీవ్ సినిమాను పూర్తిస్థాయిలో తిరుపతి వాసులే నిర్మించడం అందులోనూ నటీనటులుగా నటించిన స్థానిక కళాకారులు మన స్థానికులే కనుక , అందరూ తప్పకుండా సినిమా చూసి మన తిరుపతి కళాకారులను ఆదరించి ప్రోత్సహించండి అని అన్నారు.అలాగే సినిమా బృందం వారు మాట్లాడుతూ మన మధ్య ఉంటూ మనతోపాటు కలిసి తిరిగిన మనవాళ్లు నటులుగా తెరపైకి రావడం అందరికీ ఆనందం కలిగిస్తుందని అలాగే మీరందరి ఆది అభిమానాలు మాపై చూపి మన వారిని అందరిని ఆదరించి స్థానికంగా ఉన్న కళాకారులకు రానున్న సినిమాలలో అవకాశం కల్పించే లాగా ఆదరించి ఆశీర్వదించాలని అలాగే ఈ సినిమాను తప్పకుండా చూసి ఆనందించాలని కోరారు. వారాహి డెవలపర్స్ బాబ్జి,నటీనటులు హీరో లోకేష్ ఆగేరి ,హీరోయిన్ హారిక , రాయచోటి సాయి, డాన్ గణేష్ , సునంద , భాను ప్రియా, డాక్టర్ షీలా లోకనాదం తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫాం అందిస్తాం

–తిరుపతి విద్యాశాఖ అధికారి

**కేవీబీ పురం, నవంబరు 9 ప్రభాతవార్త:**



రాయలచెరువు ఉధృతంగా వచ్చిన నీటి ప్రవాహానికి వరదమయమైన ఆరు పాఠశాలలకు పక్కా భవనాల్లో నాలుగు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో బురదమయమైన ఆరు పాఠశాలలకు కళత్తూరు దళితవాడ, లింగేశ్వరాపురం ఎలిమెంటరీ పాఠశాల, పాతపాళెం అరుంధతివాడ, దళితవాడ పాఠశాలల భవనాలు సందర్శించి వాటి స్థానంలో నూతన భవనాలను రాష్ట్ర ప్రభుత్వం నిధుల ద్వారా స్పెషల్‌గా చేపడతామని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్.కుమార్, ఏపీసీ అసిస్టెంట్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ గౌరిశంకరరావులు తెలిపారు. రాయల చెరువు నీటి ప్రవాహానికి బురదమయమైన పాఠశాల పక్కా భవనాలను ఆదివారం విద్యాశాఖ అధికారి సందర్శించారు. కళత్తూరు ప్రవేశించి పాఠశాలలో కిచెన్ షెడ్లకు సంబంధించిన మెటీరియల్స్ వంట గదులను, వంట పాత్రలు, గ్యాస్ స్టౌవ్‌లు, మరుగుదొడ్లు పూర్తి స్థాయిలో పరిశీలించి ఎటువంటి నష్టం జరిగినా విద్యార్థులకు, పాఠశాల పక్కా భవనాలకు రాష్ట్ర ప్రభుత్వంకు నివేదికలు పంపించి అవసరమైతే అదనపు పక్కా భవనాలను కూడా మంజూరు చేయిస్తామని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాల ఆదుకుంటామని ఇది ఒక విపత్ ప్రళయమని డీఈవో పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల పట్ల రికార్డు కరాబ్ అయ్యాయని, మొత్తం తడిసి ముద్దయి పాఠశాల బీరువాలు, కంప్యూటర్లు, టీవీతో సహా దెబ్బతిన్నాయని అన్నారు. వాటి స్థానంలో విద్యార్థుల రికార్డులను అన్నింటిని ఏర్పాటు చేస్తామని డీఈవో పేర్కొన్నారు. ప్రతి పాఠశాలకు కొత్తగా స్టౌవ్, గ్యాస్ సిలిండర్లు కావలసిన వంట పదార్థాల పాత్రలు అన్ని కూడా అందించేందుకు చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా విద్యార్థులతోకలసి చాలా సేపు ముచ్చటించారు. అనంతరం పాతపాళెం ఎస్ఎల్ పురం గ్రామస్తులు చంద్రారెడ్డి పలువురు గ్రామస్తులతో డీఈవో మాట్లాడుతూ నీటి ప్రవాహంలో కరాబైన పాఠశాలల్లోని భవనాలను, పాఠశాల భవనాలను విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరగా వెంటనే పాఠశాలకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ఏపీసీవోతో పాటు తెలుగుదేశం పార్టీరైతు విభాగ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోవర్ధన్, కూటమి నాయకుడు గజేంద్ర, రమేష్, సీఎంవో సురేష్, ఏఎంవో శివశంకరయ్య, ఏఎల్ఎస్‌కో చంద్రశేఖర్ నాయుడు, సుధాకర్, వెంకటముని, ఎంఈవో లక్ష్మీపతి, ఉపాధ్యాయులు రమేష్, ఏళుమలై, జిల్లా పంచాయతీ కార్యదర్శి సుశీలాదేవి, తహసీల్దార్ రోశయ్య, ఎంపీడీవో మాలతి, నారాయణవనం, నాగలాపురం, పుత్తూరు తదితర మండలాల ఎంపీడీవోలు, జిల్లా పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

## పొంచి వున్న ప్రమాదం : ఒరిగిన వేపచెట్టు



**చంద్రగిరి, నవంబరు 9 ప్రభాతవార్త:**

చంద్రగిరి పాతపేట పెద్దోడు టీ అంగడి ముందు ప్రాణాంతకమైన ప్రమాదం భారీ వేపచెట్టు రూపంలో పొంచివున్నది. వందేళ్ళు పైబడిన వేపచెట్టు ఒరిగిపోయి కూలిపోతుందా అన్నట్లు కనిపిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నది. నిత్యం రద్దీగా వుండే ప్రదేశం కావడంతో ప్రమాదవశాత్తూ చెట్టుకూలిపోతే పెద్దఎత్తున ప్రాణనష్టం తప్పదనే హెచ్చరికలు వినబడుతున్నాయి. ఈ నేపధ్యంలో రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులు, పోలీసు అధికారులు ఈ చెట్టును పరిశీలించి, పరిస్థితిని సమీక్షించుకుని పూర్తిగా తొలగించడమా, మరేకంగానైనా చెట్టును కాపాడటమా ఆలోచన చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## చంద్రగిరి జాతర పోస్టర్లు ఎంఎల్‌ఏచే ఆవిష్కరణ

నాలుగు వారాల జాతరకు ముమ్మర ఏర్పాట్లు



***చంద్రగిరి, నవంబర్ 9 ప్రభాతవార్త:*** చంద్రగిరి జాతరకు పినపెద్దలు రూపొందించిన పోస్టర్లను ఆదివారం ఎంఎల్ఏ పులివర్తి నాని ఆవిష్కరించారు. ఇందులో భాగంగా మొదటి మంగళవారం (ఈ నెల 11న) ఉదయం శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయం నుండి చంద్రగిరి నలుదిశల్లో వెలసియున్న గంగమ్మల శూలం ఊరేగింపు కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం మిట్టగంగమ్మ ఆలయం వద్ద ఊరు పొంగళ్ళు పెట్టుకుంటారు. (రెండవ మంగళవారం) ఈ నెల 18న ఉదయం నుండి నాలుగు గంగమ్మ ఆలయాల వద్ద అబంళ్ళు పంపిణీ చేస్తారు. సాయంత్రం 6 గంటల నుండి చెట్లవద్ద కుంభాలు సమర్పించుకుంటారు. మూడవ మంగళవారం 25న ఉదయం నుండి శూలం ఊరేగింపు, మధ్యాహ్నం నుండి అంకాలమ్మకు ఊరు పొంగళ్ళు పెట్టుకుంటారు. నాలుగవ మంగళవారం డిశంబర్ 2న రాత్రి 3వ తేది వేకువజాము వరకు స్వర్ణముఖీనదిలో అత్యంత భక్తిప్రపత్తుల నడుమ ఇసుకతో అమ్మవారి ప్రతిమను తయారు చేసుకుని నలుదిశల గల గంగమ్మ ఆలయాలకు పండుగ వాతావరణంలో మోసుకురావడం విశిష్టమైన అంశంగా పరిగణించబడుతుంది. ఆరోజున చంద్రగిరి జాతర వేడుకలకు వచ్చే బంధుమిత్రులతో కళకళలాడుతుంది. ఈ కార్యక్రమంలో పినపెద్దలు పాకాల సతీష్‌కుమార్‌రెడ్డి, విరూపాక్షి శంకర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, టిడిపి తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు పెరుమాళ్ పల్లి ఈశ్వర్ రెడ్డి, టిడిపి రామచంద్రాపురం మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, నాయకులు కొత్తపాటి లోకేష్, యల్లప్ప, రాజా, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య రంగంలో ఎమ్మెల్యే థామస్ సేవలు అభినందనీయం

**నారాయణవనం, నవంబర్ 9 ప్రభాతవార్త**



వైద్య రంగంలో చిత్తూరు జిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ సేవలు అభినందనీయమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరులోని పివికే పంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక ఇన్ఫెర్టిలిటీ కన్సల్టేషన్ శిబిరానికి ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మిత్రుడు డాక్టర్ థామస్ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని సంతాన లేమితో బాధపడుతున్న దంపతులకు తక్కువ తక్కువ ఖర్చుతో పిల్లలు పుట్టేలా వైద్య సేవలు అందిస్తూ మరో వైపు ఎమ్మెల్యేగా, ప్రభుత్వ విప్‌గా ప్రజా సేవలో నిమగ్నమవడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో మరింత సేవను ప్రజలకు అందించాలని కోరారు.

## 500 కుటుంబాలను ఆదుకున్న లవ్ విన్యాక్షన్ ట్రస్టు

**కేవీబీ పురం, నవంబరు 9 ప్రభాతవార్త:**



మండలంలోని రాయలచెరువు తెగిపోయి దాదాపు 500 కుటుంబాలు నీటి బురదతో అవస్థలు పడు తున్న బాధిత కుటుంబాలకు చెన్నైకి చెందిన లవ్ ఇన్ యాక్షన్ ట్రస్టు యాజమాన్యం ఉషారీస్, ఏమీస్ రీస్ లు దుప్పట్లు, టవళ్లు, లుంగీలు తదితర వాటిని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్య వేడు ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొని ఆయన చేతుల మీదుగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలోసంస్థప్రాజెక్టు కో–ఆర్డినేటర్లు వి.రామచంద్రయ్య, ఏ.విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I VEMPALLI SHABBIER S/O NOOR BASHA VEMPALLI R/O 11-1661st Floor Tirumala Nagar Street 2oteru Road Avilala Tirumala Towers Tirupati Andhra Pradesh-517507 changed my name to LOHITH ASHWA V. (Ro.No.29433)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం

శ్రీసిటీ (తడ), నవంబర్ 9 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేసింది శనివారం తడ మండలం కాదలూరు, తడ కండ్రిగ పంచాయతీలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి సూళ్లూరు పేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరయ్యారు కాదలూరు పంచాయతీ ప్రజలు ఘన స్వాగతం పలికారు ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిరంకుశ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు అల్లూరు రమేష్ రెడ్డి, మండల కన్వీనర్ ఆర్ముగం, ముని కృష్ణారెడ్డి, మునీష్ రెడ్డి, ఎంపీటీసీ జయమ్మ, గోపాల్ రెడ్డి, నందా రెడ్డి, మునిరత్నం రెడ్డి, రమేష్, మురుగన్, రాజ్‌కుమార్, తిరుమల్‌రెడ్డి, కోడి ప్రకాష్‌లు పాల్గొన్నారు.

## నేడు సాధారణ సర్వసభ సమావేశం



వాకాడు, నవంబర్ 9 ప్రభాతవార్త: ఈ నెల 10న సోమవారం మండల సర్వసభ సమావేశం ఎంపీపీ అనసూయమ్మ ఆధ్వర్యంలో జరుగుతుందని ఎంపీడీవో సాయిప్రసాద్ తెలిపారు. వాకాడు మండల పరిషత్ కార్యాలయంలోని స్త్రీ శక్తి భవనంలో సర్వసభ సమావేశం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి వివిధశాఖ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ విఆర్వోలు, హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

## శ్యామసుందరపురంలో కార్డన్ సెర్చ్



కోట, నవంబర్ 9 ప్రభాతవార్త : పంచాయతీ పరిధిలోని శ్యామ సుందర పురంలో ఆదివారం తెల్లవారుజామున వాకాడు సిఐ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. శ్యామ సుందర పురంలో విభిన్న కులాలవారు నివాసం ఉంటున్నారు. ఒక్కసారిగా పోలీసులు ఇంటింటా జల్లెడపట్టి నిశితంగా తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేని 24 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు వాకాడు సిఐ ఆధ్వర్యంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ఎస్ఐలు నాగబాబు, బలరామయ్య, పోలీసు సిబ్బంది కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్నారని తెలిపారు. అనుమానితులు ఎవరైనా సంచరిస్తున్నా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నా అటువంటి వారి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## కోటి సంతకాల ప్రజా ఉద్యమం



వెంకటగిరి, నవంబర్ 9 ప్రభాత వార్త : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 17 మెడికల్ కాలేజీలను చంద్రబాబు నాయుడు ప్రవేటీకరణ చేయడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తూ వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ కౌన్సిలర్లు వైయస్సార్ సిపి ప్రజా ఉద్యమం కరపత్రలను ఆవిష్కరించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడానికి వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన వెంకటగిరిలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, వైసిపి కన్వీనర్ ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సంవత్సరాలు శంకరయ్య, శ్రీనివాసులు, ధనియాల రాధా, పూజారి లక్ష్మి, సుబ్బారావు, నాయకులు మురళి కృష్ణ, సతీష్, దశరథ రామిరెడ్డిలు పాల్గొన్నారు.

## నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

కోట, నవంబర్ 9 ప్రభాతవార్త : మండలం ఊనుగుంటపాలెం సొసైటీ ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు కోటలోని ఆయన నివాసంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అభిమానుల మధ్య జగన్‌మోహన్‌రెడ్డి భారీ కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు జలీల్ అహ్మద్, నెల్లూరుపల్లి కొత్తపాలెం జలసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, చిట్టేడు సొసైటీ ఛైర్మన్ శ్రీనివాసులు, వాకా విజయభాస్కర్‌రెడ్డి తదితరులు జగన్‌మోహన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాలు

దొరవారిసత్రం, నవంబర్ 9 ప్రభాతవార్త : దొరవారిసత్రం మండల పరిధిలోని తనియాలి అక్కరపాక తల్లంపాడు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం కోటి సంతకాల సేకరణ భాగంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేయాలని ఆలోచనలో కూటమి ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దారుణమన్నారు. తనియాలి గ్రామంలో వేమురెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దొరవారిసత్రం మండల అధ్యక్షులు రాహుల్‌రెడ్డి, సీనియర్ నాయకులు మునస్వామి నాయుడు, నల్లారెడ్డి సురేష్‌రెడ్డి, ఈశ్వర్, వాక పద్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పెట్రోల్ బంకుల్లో కొరవడిన వసతులు

కోట, నవంబర్ 9 ప్రభాతవార్త : మండలంలోని పెట్రోల్ బంకుల్లో వాహనదారులకు చట్టబద్ధంగా అందించాల్సిన సేవలను నిర్వాహకులు గాలికొదిలేస్తున్నారు. నిబంధనల ప్రకారం కల్పించాల్సిన మౌలిక సదుపాయాలకు తిలోదకాలిస్తున్నారు. ఇంధనాన్ని విక్రయించడమే కాదు.. వినియోగదారులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై కేంద్రప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు చేసింది. కానీ అవి అమలు కావడం లేదు. తనిఖీలు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పెట్రోల్ బంకులో వాహనదారుల కోసం తాగునీటి వసతి, మరుగు దొడ్ల వసతి, వాహనాలకు ఉచితంగా గాలి పట్టడం, పెట్రోల్, డీజిల్ కొలిచే పరికరాలు, ఇంధనం నాణ్యతను తెలుసుకునేందుకు పరీక్ష పత్రాలు, అత్యవసరాలతో కూడినవి అందుబాటులో లేవు. ఫిర్యాదుల పెట్టె రిజిస్టర్ అందుబాటులో ఉంచాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్సు రాత్రి వేళల్లో ప్రయాణాలు చేసే వారు విశ్రాంతి తీసుకునేందుకు, వాహనాలు నిలుపుదలకు పార్కింగ్ తప్పనిసరి. ఈ ప్రాంతంలో సగానికి పైగా పెట్రోల్ బంకుల్లో ఇవేమీ కనిపించడం లేదు. పెట్రోల్ బంకుల్లో నిరంతరం పౌరసరఫరాలు, తూనికలు, విజిలెన్స్, అగ్నిమాపక శాఖలు నెలవారీ తనిఖీలు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ఆ చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

## కళత్తూరులో పారిశుధ్య పనులు





కేవీబీ పురం, నవంబరు 9 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలం కళత్తూరు దళితవాడలో పారిశుధ్య పనులు జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి తిరుపతి, సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులతో పాటు పంచాయతీ పారిశుధ్య కార్మికులను రప్పించి పారిశుధ్య పనులు చేయించారు. అలాగే ఈ పారిశుధ్య పనులు త్వరగా పూర్తి చేయాలని మండలంలోని పెరిందేశం, కళత్తూరు, సదాశివపురం, ఎస్ఎల్ పురం, బ్రహ్మణపల్లి,సూరమాల, కేవీబీ పురం పంచాయతీల నుంచి కార్మికులను పిలిపించి ఆమె గత రెండు, మూడు రోజులుగా ఇక్కడే తిష్ట వేసి పనులు చేయిస్తున్నారు. కార్మికులకు పలు సూచనలు అందించి వారిచే పనులు చేయిస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారిణితో పాటు పరిసర మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### పచ్చని ఉసిరిచెట్ల నీడన...

## అటవీప్రాంతంలో ఆహ్లాదకరంలో వనభోజనం





తిరుమల, నవంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి: కార్తీకమాసంలో ఆదివారం ఉదయం పచ్చని ఉసిరిచెట్ల నీడలో...ఆహ్లాదకర వాతావరణంలో పాపవినాశనం మార్గంలోని పార్వేటమండపంలో వనభోజనం సాగింది. ఉదయం ఆలయంలో కైంకర్యాలు ముగిసిన తరువాత శ్రీదేవిభూదేవిసమేత మలయప్ప స్వామిని బంగారుతిరుచ్చిపై ఆలయం నుండి పార్వేటమండపంకు మంగళవాయిద్యాల నడుమ వేంచేపు చేశారు. అక్కడ ఉత్సవర్లకు విశేష పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. అనంతరం అక్కడ భక్తులకు కార్తీకవనంలో వనభోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయ్యంగారు, చిన్నజీయ్యం గారు, బోర్డు సభ్యులు, టిటిడి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, నాయక్, అర్చకులు పాల్గొన్నారు.

## శ్రీవారి సుప్రభాతసేవలో ముఖేశ్అంబానీ



తిరుమల, నవంబర్9 ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రిలయన్స్ సంస్థ చీఫ్ ముఖేశ్అంబానీ ఆకాంక్షించారు. ఆదివారం వేకువజామున ముఖేశ్ అంబానీ, ఆ సంస్థ ప్రతినిధులతో కలసి సుప్రభాతసేవలో పాల్గొన్నారు .

## 40ఏళ్ల తరువాత ప్రాథమిక విద్యార్థులు అపూర్వకలయిక



తిరుమల, నవంబర్ 9ప్రభాతవార్తప్రతినిధి: ఎలాంటి భేషజాలు...వివక్షత లేకుండా చదువే ధ్యేయంగా 40సంవత్సరాల క్రిందట కలసి చదువుకున్న పూర్వ విద్యార్థులు తిరుమలలో కలిశారు. ఆదివారం ఉదయం ముక్కోటిలో 1982-1990 మధ్య ఒకటినుండి ఐదవతరగతి వరకు చదివిన తిరుమల విద్యార్థులు అపూర్వకలయికతో ఆనందంతో పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేజె మమత, టివి కిరణ్‌కుమార్,ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

## 17 నుండి 25 వరకు అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

తిరుచానూరు నవంబర్ 9 ప్రభాతవార్త : నవంబరు 17 నుండి 25వ తేదీ వరకు జరుగనున్న తిరుచానూరు పద్మావతీ అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నవంబరు 11వ తేది మంగళవారం నాడు ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చాన, శుద్ధి నిర్వహించనున్నారు. ఆనంతరం ఉదయం 6.30 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. బ్రహ్మోత్సవాల కారణంగా నవంబరు 11న, నవంబరు 17 నుంచి 25వ తేదీ వరకు అన్ని ఆర్జిత సేవలను తితిదే రద్దు చేసింది.

## మియావకీ తరహా ప్లాంటేషన్‌కు డిప్యూటీ సిఎం శ్రీకారం



చిత్తూరు(పలమనేరు), నవంబర్ 9 ప్రభాతవార్త: పలమనేరు ముసలి మడుగు ఏనుగుల శిక్షణా కేంద్రం ఆవరణలో ఆదివారం డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ మియావకీ తరహా ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు పెంచడం ద్వారా అడవిని పెంపొందించే మియావకి తరహా ప్లాంటేషన్ దోహదపడుతుంది. 250 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్లాంటేషన్‌ను అటవీశాఖ ఏర్పాటు చేసింది. ఉసిరి మొక్కను నాటి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఈ దట్టమైన అడవుల పెంపకం కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సదర్భంగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మియావకి ప్లాంటేషన్‌ను నిశితంగా పరిశీలించి తన మొబైల్‌లో వీడియో తీసుకున్నారు. ఈ మొక్కల మధ్యలో పొదలను ఎప్పుడు ఏర్పాటు చేస్తారని డిప్యూటీ సిఎం అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మావటీలకు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ 50 వేల రూపాయలను బహుమతిగా అందజేశారు. కర్నాటక రాష్ట్రం నుండి కుంకీ ఏనుగులను స్వీకరించే సమయంలో వీటిని జాగ్రత్తగా చూసుకోవాలని డిప్యూటీ సిఎం మావటీలతో పేర్కొన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చెప్పిన విధంగానే మావటీలు పలమనేరు ఎలిఫెంట్ క్యాంపులో కుంకీల సంరక్షణ బాధ్యతలు పక్కాగా చూసుకుంటున్నారు. మావటీల పనితీరును మెచ్చుకుని వారికి డిప్యూటీ సిఎం 50 వేల రూపాయలు బహుమానంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ దూడి, ఎమ్మెల్యేలు అమరనాధరెడ్డి, గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు, జిల్లా అటవీశాఖ అధికారి సుబ్బరాజు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, అనంతపురం సర్కిల్ అటవీ సంరక్షణ అధికారి ఆర్.యశోద భాయ్, పర్యావరణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, నవంబర్ 9 ప్రభాతవార్త: రాష్ట్ర వైకాపా పార్టీ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం శ్రీకాళహస్తిలోని వైకాపా కార్యాలయంలో మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సారథ్యంలో 'ఉద్యమం పోస్టర్'ను ఆవిష్కరించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా పార్టీ సారథ్యంలో ఈ నెల 12న ర్యాలి నిర్వహించుటకు ఆదేశించారన్నారు. ఈమేరకు భారీ ఎత్తున నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నామని మధుసూధనరెడ్డి వివరించారు. నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏమి చేయకున్నా వైకాపా నాయకులపై కక్ష సాధింపు చర్యలు,అక్రమ పోలీసు కేసులతో భయబ్రాంతుల్ని చేస్తున్నారన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో నిరుపేద, మధ్యతరగతి ప్రజల డాక్టర్ల ఆశలు అణగారిపోతయాని వివరించారు. పెట్టుబడి దారుల కొమ్ముకాస్తున్న కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ స్థలాలను పరిశ్రమలు, ఉద్యోగాలంటూ ఆశ చూపుతూ ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైకాపా నాయకులు బర్రెసుదర్శనం రెడ్డి, శ్రీనివాసులుంరెడ్డి, కోవవి చంద్రయ్యనాయుడు కోగిలి సుబ్రమణ్యం, శరవణ కుమార్ గోరా, కంఠాఉదయ్, పఠాన్‌ఫరీద్‌ఖాన్ మునికృష్ణారెడ్డి, పులి రామచంద్రయ్య అస్లాం, గౌస్‌బాషా, జివికె రెడ్డి, టట్రైలర్ శ్రీను, లు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్... పోటీలకు క్రీడాకారులు ఎంపిక



చిత్తూరురూరల్, నవంబరు 9ప్రభాతవార్త: చిత్తూరు పట్టణం, మెసానికల్ క్రీడా మైదానంలో ఆదివారం 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -14 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించి రాష్ట్ర స్థాయి పోటీలకు 10మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఫెడరేషన్ కార్యదర్శులు బాబు, శారదలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారనీ, వీరిలో రాష్ట్రస్థాయి పోటీల్లో (బాలల విభాగం) చిత్తూరు జిల్లాకు చెందిన ఆర్వీతేజస్, జీ నితీష్, పిఎస్ శశాంక్, తిరుపతికి చెందిన సి.హరిసోనాల్, కె.మోత్విక్‌లు, బాలికల విభాగంలో చిత్తూరుకు చెందిన బి.మోక్షిత, తిరుపతికి చెందిన పి.ఆయేస్సా, ఏ.సిరిచందన్, వీగుహిక, బి పూజితలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కాగా ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25న గన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడనున్నారన్నారు. క్రీడాకారులను జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ గోపిరెడ్డి, సహచర క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

## గణనాథుని సేవలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రష లోకాయుక్త



కాణిపాకం, నవంబర్ 9 ప్రభాతవార్త: రాష్ట్ర లోకాయుక్త రజిని ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయంలో రాజగోపుం వద్ద ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు,ఐరాల తహశీల్దార్ లోకేశ్వరి, కాణిపాకం ఎస్సై నరసింహులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధాప్య పెన్షన్ దారులపై ...

## సచివాలయ ఉద్యోగి అసభ్యకర పదజాలం



పూతలపట్టు, నవంబర్ 9 ప్రభాతవార్త : పూతలపట్టు మండలం పి. కొత్తకోట గ్రామ సచివాలయంలో పనిచేస్తున్నటువంటి కాంట్రాక్టు ఉద్యోగి గణపతి సచివాల యంకు వచ్చే వృద్ధులను కించపరిచే విధంగా నిర్లక్ష్య ధోరణితో మాట్లాడటం సర్వసాధారణమైందని గ్రామస్తులు వాపోతున్నారు. అతని ప్రవర్తనను కార్యాలయంలో ఎవరూ మందలించకపోవడంతో ఆశ్చర్యానికి గురిచేస్తుందని వృద్ధులు వాపోతున్నారు. వసంతాపురం దళితవాడకు చెందిన జి. నాగమ్మ అనే వృద్ధురాలు రెండు నెలలుగా వృద్ధాప్య పెన్షన్ రాకపోవడంతో సచివాలయం లోకి వచ్చినందుకు ఆమెపై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా చేయి కూడా చేసుకున్నట్లు బాధితురాలు కన్నీటి పర్యంతమైంది. ఈ ఘటనపై పూతలపట్టు ఎంపీడీవో సమగ్ర విచారణ జరిపించి ఇకపై గ్రామ సచివాలయానికి సమస్యలపై వచ్చే వృద్ధులపై ఇలాంటి సంఘటనలు జరగనివ్వకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## శివయ్య సన్నిధిలో సంకట హర చతుర్థి హోమాలు



శ్రీకాళహస్తి, నవంబర్ 9 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ఆదివారం సంకటహర చతుర్థి పూజలు,హోమాలు నిర్వహించారు. ఆలయంలోని పలు ప్రాంతాలు శాంతికి చిహ్నంగా ఉంది. ముఖ్యంగా మహిమాన్వితమైన అంజంజి వినాయక ఆలయం వద్ద సంకటహర చతుర్థి పూజలు నిర్వహిస్తున్నారు. వరాలివ్వటానికి మూలమైన కన్యామూల గణపతి ఆలయం వద్ద ఆదివారం హోమాలు ఏర్పాటు చేసారు. ఆలయానికి చెందిన ఎస్ఎంకె శ్రీనివాసు గురుకుల్ సారధ్యంలో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి హోమాలు ఏర్పాటు చేసారు. శ్రీనివాసు గురుకుల్ శాస్త్రోక్తంగా హోమాలు పూర్ణాహుతి గావించారు. గతంలో సంకటహర చతుర్థి పూజలను ఆలయం తరపునే నిర్వహించే వారు.అయితే దీనిని కకూడా సేవగా మార్చారు. భక్తులకు అవకాశం కల్పించారు. ప్రతి నెల భక్తులు ఈ పూజలు,హోమాలు జరుపుకుంటున్నారు.కన్యామూల గణపతి ఆలయం వద్ద కలశ స్థాపనగావించారు. హోమాలు వెలిగించారు. ఆలయం తరపున డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతులు, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్ సంకల్పంతో పూజలు నిర్వహించారు. పూర్ణాహుతితో పూజలు ముగిసాయి.

## ఉప ముఖ్యమంత్రికి ఘనంగా స్వాగతం... వీడ్కోలు

రేణిగుంట నవంబర్ 9 ప్రభాతవార్త: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కు రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం ఘనంగా స్వాగతం వీడ్కోలు లభించాయి. ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుండి నేరుగా అయిన ప్రత్యేక హెలికాప్టర్లో పలమనేరు బయలుదేరి వెళ్లారు. అక్కడ కుంకి ఏనుగులు ఏనుగులకు శిక్షణ నిచ్చే విధానాన్ని పరిశీలించి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం హెలికాప్టర్లో రేణిగుంట చేరుకొని వచ్చిన విమానంలోనే గన్నవరం బయలుదేరి వెళ్లారు..

## బాధితురాలిని అన్ని విధాల ఆదుకుంటాం

-ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్



కార్వేటినగరం, నవంబర్ 9 ప్రభాత వార్త : బాధితకుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ప్రభుత్వ విప్ గంగాధరనెల్లూరు శాసన సభ్యులు డాక్టర్ వి.యం.థామస్ అన్నారు. కార్వేటినగరం మండలం అన్నూరు పంచాయితి పరిధిలోని చౌటూర్ గ్రామంలో ఇటీవల తుఫాను సమయంలో ఇల్లు కోల్పోయిన బాధితురాలు జ్ఞానమ్మకు రూ. 50,000ల చెక్కును అందించారు. చౌటూర్ మహిళలు ఎమ్మెల్యేకి కర్పూరహారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వంత ఇంటి నిర్మాణానికి రూ. 2,30,000లు మంజూరు చేయిస్తామన్నారు. అలాగే ప్రభుత్వం నుండి రూ. 90,000లు కూడా అందించనున్నామన్నారు. డ్రైనేజి సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే వద్దకు పలు సమస్యలను తీసుకురావడం జరిగింది. సశ్మానంకు దారి సౌకర్యం కల్పించి, ప్రహరీగోడ, షెడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కృష్ణసముద్రం గ్రామంలో గత ప్రభుత్వం హౌసింగ్‌ను చెరువు లోతట్టు ప్రాంతంలో ఇచ్చారని అప్పట్లో ఇల్లు నిర్మించుకోవడంతో చెరువునీళ్ళు ఇళ్ళల్లోకి వస్తున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఇండ్ల ముందర సి.సి.రోడ్డును ఎత్తుగా నిర్మించి ఇండ్లలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటిపై సోలార్ ఏర్పాటు చేసుకుంటే కరెంటు సమస్య ఉండదని సబ్సిడీ ద్వారా సోలార్ వేసుకోవచ్చన్నారు. ఇంటికి సరిపడి మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేసుకుంటుందన్నారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట మండల దేశం అధ్యక్షులు చెంగల్‌రాయల్‌యాదవ్, సింగల్‌విండో ఛైర్మన్ మాదిరాజు జనార్ధన్‌రాజు, రాజా, సోము, యం.మురళీకృష్ణ, ఆర్ఐ నరసింహులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎంకు ఘన స్వాగతం



చిత్తూరు(పలమనేరు), నవంబర్ 9 ప్రభాతవార్త: పలమనేరు ముందరమడుగులో కుంకీ ఏనుగుల శిక్షణా కేంద్రంను ప్రారంభించడానికి వచ్చిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం లభించింది. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ దూడి, ఎమ్మెల్యేలు అమరనాధరెడ్డి, గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీ మోహన్‌లు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు హెలిప్యాడ్‌లో స్వాగతం పలికారు. అలాగే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు డిఎఫ్ఓ సుబ్బరాజు, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, అనంతపురం సర్కిల్ అటవీ సంరక్షణ అధికారి ఆర్.యశోద భాయ్, పర్యావరణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే తదితరులు స్వాగతం పలికారు.

### బస్సును ఓవర్‌టేక్ చేయబోయి...

## కల్వర్టు గొయ్యిలో పడి వ్యక్తికి తీవ్రగాయాలు

పుత్తూరు రూరల్, నవంబరు 9 ప్రభాతవార్త: బస్సును అధిగమించే ప్రయత్నంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి కల్వర్టు గొయ్యిలో పడడంతో ఇనుప చువ్వలు గుచ్చుకుని తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం జరిగింది. ఎస్ఐ ఓబయ్య కథనం మేరకు... అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం బుర్నాగుంటకు చెందిన షేక్‌దస్తగిరి కుమారుడు షేక్‌వలీ (44) పుత్తూరులో ఉంటూ చుట్టు పక్కల గ్రామాల్లో బట్టలు విక్రయిస్తుంటాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం పుత్తూరు నుంచి నగరికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. పరమేశ్వరమంగళం-వేపగుంట క్రాస్ రోడ్డు మధ్యలో ముందు వెళుతున్న బస్సును అధికమించే ప్రయత్నంలో అదుపు తప్పి ద్విచక్రవాహనం తిరుపతి-చెన్నై జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపడుతున్న కల్వర్టు గొయ్యిలో పడిపోయాడు. దీంతో అతనికి నిర్మాణంలో ఉన్న కల్వర్టు ఇనుప చువ్వలు గుచ్చుకుంది. సుమారు గంట పాటు శ్రమించి ఇనుప చువ్వను కత్తిరించి స్థానిక అన్నగౌరీ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి తిరుపతి రుయాకు తరలించారు. రుయాలో వైద్యులు సర్జరీ చేసి ఇనుప చువ్వను తొలగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

## అక్రమ రవాణా బియ్యం స్వాధీనం

తొట్టంబేడు, నవంబర్ 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గం నుంచి అక్రమంగా రవాణ జరుగుతున్న బియ్యంను ఆదివారం పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఈ సంఘటనతో సంబంధం ఉన్ననలుగురు వ్యక్తులును రవాణా చేస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు టూటౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు ఎంజిఎం సర్కిల్ నుంచి రవాణా అవుతున్న వాహనాన్ని నిలిపిపరిశీలించగా ఇందులో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని సిఐ నాగార్జున్‌రెడ్డి వివరించారు. నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వాహనంలో 74బియ్యం బస్తాలున్నాయని వాటిని తూకం వేయగా3550 కిలోలు ఉన్నట్లు తేలిందని సిఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

## పలకరింపులు, ఓదార్పులు



శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 9 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు మండలాల్లో బొజ్జల బృందమ్మ విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల్ని ఆకట్టుకుంటున్నారు. నిర్విరామంగా ఆమె పర్యటనలు సాగిస్తున్నారు. ఆదివారం ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేటకు చెందిన ఎం అర్జున్‌బాబు సోదరుని సతీమణి ఎం.శాంతి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని బృందమ్మ పలకరించారు. ఓదార్చారు. ఆమెతో పాటు వంగనూరు కృష్ణప్ప, మేకలత్తూరు అర్జున్‌బాబు ఎం.రవి,ఎం. దొర కృష్ణ, ఎం.సుబ్రమణ్యం, కందవేలు, మురుగన్, సూరకాని శ్రీనివాసులు, ఎం.ముత్తప్పమొదలి,కృష్ణయ్య తదితరులున్నారు. కాగా శ్రీకాళహస్తి మండలంలోని కమ్మకొత్తూరు గ్రామానికి చెందిన పచ్చ శ్రీనివాసులు నాయుడు బంధువు ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు.